



Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, జూన్ 2, 2026 | సంపుటి - 22 | సంచిక 244 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

**పేచీ కేవలం అక్కడి నాయకులతోనే**

**ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం**

**పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక**

హైదరాబాద్ : ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా రాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. 2లో




# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, జూన్ 02, 2026 | సంపుటి - 20 | సంచిక 254 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పంట మార్పిడి ప్రాధాన్యాన్ని
# రైతులకు తెలియజేయాలి

### వర్షాభావంపై రైతులకు అవగాహన

- నీటి వినియోగం తక్కువున్న పంటలపై వివరణ
- దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ
- అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

**వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.**



హైదరాబాద్ : నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ తరువాయి 2లో



## తెలంగాణపై విషం చిమ్ముతున్న
# పవన్ కళ్యాణ్

- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి?
- తెలంగాణ దిష్టి తగిలిందని ఆనాడు అనలేదా
- బిజెపి ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన తరువాయి 2లో



## ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు

నేడు ఢిల్లీలో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. తరువాయి 2లో

## పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై అసత్య ప్రచారాలు

**ఇది ఎప్పుడూ ఉండేదే అన్న ఛైర్మన్ బుర్రా**

**ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తాం**

**ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు**

హైదరాబాద్ : తెలంగాణలోని నిరుద్యోగ నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం ఒక పెద్ద శుభవార్త చెప్పారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరికొత్త మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. తరువాయి 3లో

## రైల్వేజోన్ కల
# సాకారమయ్యింది



**రైల్వేజోన్ రాకతో ఉత్తరాంధ్రకు మహర్దశ**

**ఇచ్ఛాపురం సంబరాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్**

శ్రీకాకుళం : ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ సాకారమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే దక్షిణ కోస్తా రైల్వే అని తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త జోన్ ఏర్పాటుతో లక్షలమంది ప్రయాణికులకు లబ్ది చేకూరుతుందన్నారు. 2లో

## నదీజలాలపై రాజీ లేకుండా
# చూడాలి

**మనవాటా మనకు దక్కేలు చర్యలు ఉండాలి**

**అంతరాష్ట్ర జలాలను డ్యామ్‌ల వారీగా విడుదలకు చర్చించాలి...**

**వర్షాకాలంలోపు డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి**

**హైదరాబాద్నగరంలోవాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మాణాలు పూర్తి చేయాలి**

**తాగు నీటికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు తలెత్తవద్దు...**

**సమస్యల పరిష్కారంలో కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో సాగాలి**

**వర్షాకాల సన్నద్ధత సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మిగతాది 2లో

## ఎన్డీఏ కూటమి వరుస
# విజయాలు సాధించాలి

### అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

పేదలకు నేరుగా పెన్షన్ ఇస్తేనే ఆనందం

పేరికం లేని సమాజమే తన లక్ష్యం

తునిలో పెన్షన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు



కాకినాడ : పేదవాడి ఇంటికెళ్లి పెన్షన్ ఇస్తే.. ఆ ఆనందమే వేరని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అందుకే బటన్ నొక్కడానికి ఇష్టపడట్లేదని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం చూడాలనేది తమ ప్రభుత్వ కల అని ఉద్ఘాటించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో సీఎం సోమవారం పర్యటించారు. తుని నియోజకవర్గం, చామవరంలో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పెన్షన్ల ద్వారా 62.34 లక్షల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రద్దుచేశారని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం చంద్ర బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చి రాజకీ యంగా ఎదిగేలా చేస్తామని వ్యాఖ్యానించారు. ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ముఖ్యమంత్రి తరువాయి 2లో



## వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలిపార్టీ
# కుట్ర

**ఆపార్టీ కార్యకర్తతో చేయించి, కూటమిపై నెట్టే యత్నం**

**నంద్యాల ఘటనపై మంత్రి అనగాని ఘాటు విమర్శలు**

అమరావతి : నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. తరువాయి 2లో



## జూన్ 7 నుంచి 21 వరకు
# యోగా కార్యక్రమాలు

రెండున్నర లక్షల మందిని భాగస్వాములను చేస్తాం

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి : ఏపీలో జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సారి 2.5 లక్షల మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్ర బాబు సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలని, వెస్టర్న్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పొదుపు చర్యల్లో భాగంగా 30 రోజుల నుంచి 15 రోజులకు కుదించినట్లు తెలిపారు. జూన్ 21న ప్రధాన యోగా కార్యక్రమం వెస్టర్న్ బైపాస్ రోడ్డుపై నిర్వహించాలనే దానిపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 2లో

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు.ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలిపార్టీ కుట్ర

విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ నేతలే తీయించడం.. మళ్లీ ధర్నాలు చేయడం ఆ పార్టీకే చెల్లిందంటూ దుయ్యబట్టారు. శవం, సింపతీ, స్టాట్యూ అనేది గొడ్డలి పార్టీ విధానమంటూ వ్యాఖ్యానించారు. వైఎస్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారని.. ఇప్పుడు అదే విగ్రహాలను విధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. గతంలోనూ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తెలుగుదేశం పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం చేశారన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం విషయంలో కుట్రలు బయటపడ్డాయి కాబట్టి... సాక్షిలో పెద్దగా కవరేజ్ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని గొడ్డలి పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తుంటే.. డీఎస్సీలో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారాలు బయటపడుతుండడంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఏడాది క్రితం జరిగిన డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వ్యాఖ్యానించారు. జెన్-జీ, జెన్-అల్ఫా భవితకు అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని అనగాని తెలిపారు. ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయని... ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖచిత్రం మారుతోందని.. దీన్ని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. రాష్ట్రం అగ్రస్థానంలోకి వెళ్తున్నప్పుడు... అనిశ్చితి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ స్కాం.. లిక్కర్ స్కాంలు బయటకొస్తుంటే గొడ్డలి పార్టీలో వణుకు పుడుతోందన్నారు. తానిచ్చే బిర్యానికి కార్యకర్తలు ఎదురు చూస్తూ ఉండాలనే ఆలోచన గొడ్డలి పార్టీ నాయకుడిదంటూ దుయ్యబట్టారు. ప్రజలు చక్కటి ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని మెరుగైన జీవితాన్ని పొందాలనేది తమ నాయకుడి ఆలోచన అని తెలిపారు. ఓ డీఎస్సీని అద్భుతంగా నిర్వహించి.. మళ్లీ ఇంకో డీఎస్సీని నిర్వహించు కునేందుకు సిద్ధమవుతుంటే.. కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. యువకులు నిర్వీర్యమైపోవాలనేది గొడ్డలి పార్టీ ఆలోచన అని.. యువతకు ఉద్యోగాలు కల్పించాలనేది కూటమి సంకల్పమని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

# రైల్వేజోన్ కల సాకారమయ్యింది

రైల్వేను అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే కృషి చేసినట్లు చెప్పారు. 'రైల్వే జోన్ కోసం పార్లమెంట్‌లో నిరంతరం మాట్లాడా. ఇచ్ఛాపురం బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వంలోనే పరిష్కారం లభిస్తుంది. బ్రిడ్జి మాత్రమే కాకుండా అండర్ బ్రిడ్జిపైనా దృష్టి సారిస్తాం. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇచ్ఛాపురం అంటే మూలన ఉండేది కాదు.. ముఖ ద్వారం కాబోతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ధన్యవాదాలు అని రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ జోన్ కోసం పార్లమెంట్‌లో అనేక పర్యాయాలు పోరాడానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రైల్వే జోన్ సాధన కోసం ఆ రోజుల్లో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో దీక్ష చేపట్టినట్లు గుర్తుచేశారు. నేడు కేంద్ర మంత్రిగా ఉండి దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేటి నుంచి విశాఖపట్నం నుంచి పరిపాలన ప్రారంభమైందన్నారు. 'కొత్త రైల్వేజోన్ ద్వారా ఇక నుంచి మన సమస్యలను మనం తీర్చుకోగలం' అని తెలిపారు. ఇచ్ఛాపురం మండలం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం ఏ.ఏస్ పేట వద్ద సౌత్ కోస్ట్ రైల్వేజోన్ స్వాగత బోర్డ్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్ సోమవారం ఆవిష్కరించారు. కొబ్బరికాయ కొట్టి, జోన్ ప్రారంభోత్సవానికి గుర్తుగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. 'గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు కృషి చేశారు. 12 సంవత్సరాలుగా నా భుజాలపైన సమస్యను వేసుకొని పోరాడి రైల్వే జోన్‌ను సాధించా' అని చెప్పారు. ఈ సరికొత్త రైల్వే జోన్ ప్రారంభం నేపథ్యంలో తెలుగు ప్రజలకు, ఆంధ్ర రాష్ట్రానికి, శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే బలమైన లీడర్ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు శ్రీకాకుళం జిల్లా ప్రజల తరఫున కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

## టెట్ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల

### జూన్ 16 నుంచి జూన్ 22 వరకు పరీక్షలు

హైదరాబాద్,జూన్1 : తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష -2026 షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 16 నుంచి జూన్ 22 వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ 2 గంటల నుంచి 4:30 గంటల వరకు ఉంటుంది. పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పేపర్-1, పేపర్-2 పరీక్షల తేదీలతో పాటు ఉత్తీర్ణత ప్రమాణాలను కూడా అధికారులు వెల్లడించారు. దీంతో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రణాళికలను మరింత మెరుగ్గా రూపొందించుకునే అవకాశం లభించింది. టీఎస్ టెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.బీసీ అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందుతారు.

# పంట మార్పిడి ప్రాధాన్యాన్ని తెలియజేయాలి

అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్

మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించాలి

టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. 'పార్టీయే సుప్రీం.. కార్యకర్తే నాయకుడు' అనే సిద్ధాంతంతో ప్రతి ఒక్కరూ పార్టీ సైనికుడిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. తునిలో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ అందించడం ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గిస్తామని సీఎం తెలిపారు. అలాగే రైతులకు ఉచిత వ్యవసాయ పంపుసెట్లు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్ కింద రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ, క్లస్టర్ స్థాయి సమావేశాల్లో మహిళల భాగస్వామ్యాన్ని భారీగా పెంచాలని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలను ఆర్థికంగా ఎదిగేలా చేయడం తమ నైతిక బాధ్యత అని చంద్రబాబు చెప్పారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, అనంతరం జూన్ 25 నుంచి నాయకులు, కార్యకర్తలు పర్యావరణ హితంగా సైకిళ్లపై ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో సాధించిన 55.5 శాతం ఓట్ల కంటే మరింత ఎక్కువ ప్రజా మద్దతు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన డిక్షనరీలో ఓటమి అనే మాట ఉండకూడదని.. ప్రతి కార్యకర్త ఏకపక్షంగా గెలుపు సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ దివ్యాంగ యువకుడిని ఆప్యాయంగా పలకరించారు. సీఎం స్వయంగా అతని దగ్గరకు వెళ్లి భుజంపై చేయి వేసి ఫోటో దిగడంతో ఆ దివ్యాంగ యువకుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు. యువకుడి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతూ, 'మీరంటే మా కుమారుడికి ఎంతో అభిమానం' అని తెలిపారు. వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్‌ను పిలిచిన సీఎం.. ప్రభుత్వం తరఫున దివ్యాంగ యువకుడికి అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా సాగుతున్న వివిధ పంటల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మైక్రో న్యూట్రియెంట్స్‌తో పాటు ప్రకృతి సేద్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

# నదీజలాలపై రాజీ లేకుండా చూడాలి

హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావారణ శాఖ నివేదిస్తున్నందున కృష్ణా, గోదావరిజలాల్లోమన వాటా జలాలు దక్కేలాచూడాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా ఉన్నందున అంతరాష్ట్రజలాల్లో ప్రోరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందిం చాలని సీఎం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల వర్షాకాల సన్నద్ధతపై సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి సోమవారం సమీక్షనిర్వహించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జలవిద్యుదత్పత్తికే మహారాష్ట్రవినియోగిస్తోందని... ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసే దానిపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని సీస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. గోదావరినది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని... అయితే ఆ వరదంతా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సిన వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీఎం ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. గతంలోకడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను సీఎం గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికితెలియజేశారు. ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల నుంచి అవగాహనకల్పించాలని సీఎం సూచించారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని సీఎం తెలిపారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంటలసాగుతో పాటు అవసరమైనవిత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తాను క్షేత్ర స్థాయిలో పర్యటించినసమయంలో ఇచ్చిన హామీల అమలుపై అధికారులనుముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నాడు ఇచ్చిన హామీలు.. వాటి ప్రస్తుతపరిస్థితి.. ఏవైనా నెరవేరకుంటే అందుకు కారణాలతో తనకు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం సూచించారు. వడగాలులు, వరదల సమయంలోప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడువెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదలసమయంలోదెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతనవంతెనల నిర్మాణం, ఇతరపనులకువిపత్తునిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వ్యయం చేయాలని సీఎం సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్ పైవరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నీరు నిలిచే 141ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపైముఖ్యమంత్రిఅధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే11వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పూర్తి చేశామని, మిగతా వాటి పనులుకొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆ పనులుయుద్ధప్రాతిపదికనచేపట్టాలని.. వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీనియర్ అధికారి జయేశ్రంజన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో సమస్యలపరిష్కారానికి మూగ్గురుకమిషనర్లు, మూడు నగరాల పోలీస్ కమిషనర్లుసమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. వర్షాభావపరిస్థితులునెలకొన్నాహైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు సీఎంకు తెలియజేశారు. పరిస్థితికితగినట్లు తాగు నీరు, విద్యుదుత్పత్తి, సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సీఎం సూచించారు. గాలిదుమ్ములు, భారీ వర్షాలతోట్రాన్స్‌ఫార్మర్లుదెబ్బతిన్నపుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్వణమే స్పందించి మరమ్మతులు పూర్తి చేసి సరఫరానుపునరుద్ధరించాలని ఆదేశించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణీత సమయంలో భేటీ అవుతూ ఉండాలనిముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజాసమస్యలుపరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా, మండల స్థాయిలోనూ రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలన్నీపరిష్కారమవుతాయని సీఎం అన్నారు. సమీక్షలో ఎంపీ వేంనరేందర్ రెడ్డి, డీజీపీ సి.వి.ఆనంద్, వివిధ శాఖలఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, దాన కిశోర్, టి.కె.శ్రీదేవి, ఏ.వి.రంగనాథ్, నవీన్ మిట్టల్, సురేంద్ర మోహన్, క్రిస్టినాజోంగ్తూ, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరికమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు

ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులు, బీఆర్ అంబేద్కర్ కోనసీమలో రైతులు, కృష్ణా జిల్లాలో లారీ ఓనర్ల అసోషియేషన్ ద్వారా యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.ఈ ఏడాది రెండున్నర లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలిపారు. వెస్ట్రన్ బైసాప్‌లో 25 వేల మందితో యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2020-25 వరకు మెంటల్ హెల్త్ విషయంలో సగటున 8 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని సత్యకుమార్ తెలిపారు. డయాబెటిక్స్, హైపర్ టెన్షన్‌ల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. అందుకే ఆధునిక జీవన విధానంలో ధ్యానం చాలా అవసరమన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు యోగాకు సంబంధించి యూట్యూబ్ వీడియోలను 3 నిముషాల నుంచి గంట వరకు మంతెన సత్యనారాయణ రాజు తయారు చేసినట్లు తెలిపారు. యోగాను విద్యా కరిక్యులమ్‌లో కూడా చేర్చడం జరిగిందని... వేసవి కాలం తరువాత విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 1 నుంచి జూన్ 20 వరకు యోగాలో వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం మీడియా కూడా సహకరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. జూన్ నెలను ఫిజికల్, మెంటల్ హెల్త్‌కు అంకితం చేసుకోవాలని యోగా, నేచరోపతి సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. 90 వీడియోలను ఒక్కొక్కటి 5 నిముషాల నిడివితో రెడీ చేసినట్లు తెలిపారు. 21 వ్యాధులకు సంబంధించి థెరపిటిక్ యోగా వీడియోలు 15 నిముషాలు ఉండేలా తయారు చేశామన్నారు. యోగా పట్ల ఉన్న అనుమానాలు, అపోహలు పోగొట్టేలా 50 వీడియోలు చేసినట్లు చెప్పారు. వీటిని డౌన్ లోడ్ చేసుకోవడానికి వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 8142404888 అనే వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెడితే గూగుల్ లింక్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంతెన సత్యనారాయణ రాజు పేర్కొన్నారు.

# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా పట్టివేత

### 11మంది నిర్వాహకుల అరెస్ట్

హైదరాబాద్,జూన్1 : తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై సీఐడీ చీఫ్ చారు సిన్హా ఆధ్వర్యంలో కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భారీ నెట్‌వర్క్ కార్యకలపాలను బట్టబయలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ గేమింగ్ మాఫియాపై చేపట్టిన ఈ చర్యల్లో మొత్తం 11 మంది నిర్వాహకులను అధికారులు అరెస్టు చేశారు. వీరిలో తెలంగాణకు చెందినవారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కూడా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని సీఐడీ చీఫ్ చారుసిన్హా వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులను సీఐడీకి బదిలీ ఆయిన కేసులను విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కేసు పూర్తి వివరాలను చారుసిన్హా మీడియాకు వెల్లడించారు. కరీంనగర్‌లో నమోదైన డాఫా బెట్ కేసును ఛేదించామని తెలిపారు. 46 మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్‌ను సీజ్ చేశామని చెప్పుకొచ్చారు. ఈ కేసులో ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ఆర్గనైజర్లు రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షలు సంపాదిస్తున్నారని అన్నారు. 40 మంది అధికారులు ఈ కేసును విచారణ చేశారని వెల్లడించారు. 15 రోజుల సీఐడీ ఆపరేషన్‌లో ఢిల్లీ, గుజరాత్, పంజాబ్‌లో 11 మందిని అరెస్ట్ చేశారని చెప్పారు. ఇది ఒక ఇంటర్నేషనల్ బెట్టింగ్ దందా అని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో దేశవ్యాప్తంగా ఆపరేషన్ చేసి నిందితులను అరెస్ట్ చేశామని చారుసిన్హా వివరించారు. ఈ డాఫా బెట్‌పై 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు, 73 క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్లపై 414 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. 108 ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్‌లను గుర్తించి కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సమన్వయంతో 37 ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్లు ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మాత్రమే అందుబాటులో ఉండేలా జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కౌన్సెలింగ్ చేశామని అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు , సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఒక్క ఛాన్స్ ఇచ్చామని చెప్పారు. వారికి కౌన్సెలింగ్ చేశామని, మళ్లీ రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు

## సెక్షన్ చెల్లదన్న నాంపల్లి కోర్టు

హైదరాబాద్,జూన్1 : సింగరేణి కార్యాలయంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్టయిన బాల్క సుమన్ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. అతడిపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సెక్షన్ వర్తించదని నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది. బాల్క సుమన్‌పై కేసులో 2 సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని కోర్టు వెల్లడించింది. అతడిపై నమోదు చేసిన మిగిలిన సెక్షన్లను నాంపల్లి కోర్టు తొలగించింది. బాల్క సుమన్‌పై నమోదైన కేసు నేపథ్యంలో సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. సుమన్ రిమాండ్ రిజక్ట్ కోరుతూ మెమోను దాఖలు చేశారు. మే 26వ తేదీన తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ.. నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# తెలుగు రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు కుట్ర

## బీఆర్ఎస్ పై ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,జూన్1 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు అయిన తర్వాత తెలుగు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతోందంటూ బీఆర్ఎస్ పార్టీపై ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తెలంగాణలో సభ పెట్టుకో వచ్చన్నారు. అయితే తెలంగాణను కించపరిస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో యెన్నెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. చెట్టాపట్టాలు వేసుకున్నారని గుర్తు చేశారు. అలాంటి కేసీఆర్ ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ వ్యతిరేకులను ఓడించేందుకు కేసీఆర్ అన్ని విధాల సహాయం చేశారని ఆరోపించారు. గత ఎన్నికల్లో తెలంగాణలో కూటమి పోటీ చేసిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి వచ్చినా ఇంకెవరు వచ్చినా తెలంగాణలో వచ్చేది తమ ప్రభుత్వమే అని ఆయన జోస్యం చెప్పారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేయ లేదా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టారని గుర్తు చేశారు. అలాంటి వాళ్లు ఇప్పుడు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతల తీరును ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎండగట్టారు.

# కుటుంబంలో చిచ్చు పెట్టిన ఫోన్ ట్యాపింగ్

## బిఆర్ఎస్ నిర్వాకంపై మండిపడ్డ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్,జూన్1 : గత బిఆర్ఎస్ హయాంలో తన ఫోన్ మాత్రమే కాకుండా తన తల్లి, భార్య ఫోన్ నంబర్లను కూడా ట్యాప్ చేసినట్లు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించారు. సీఎల్పీ హాల్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.'మీ భర్తతో మాట్లాడే విషయాలను వేరే వాళ్లు వింటే మీకు ఎలా ఉంటుంది?' అంటూ ఆయన ప్రశ్నించారు. తన తల్లి పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని పేర్కొన్న ఆయన.. కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం బాధాకరమని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తమ కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. 'ఇంటికి వెళ్తే మా భార్య నన్ను తిడుతోంది. నీ వల్ల నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని నా భార్య అడిగితే ఏం చెప్పలేకపోతున్నా' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి రావడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. 'బిజినెస్ చేసుకుంటూ ఉంటే బాగుండేది. రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని ఇప్పుడు ఆలోచిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా చర్యలు చేపడతారనే నమ్మకం ఉందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు.

# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
## ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు

హైదరాబాద్,జూన్1 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు ఘనంగా నిర్వహణ....

నల్గొండ జిల్లా ప్రతినిధి : ది క్రైమ్ న్యూస్ : జూన్ 01 నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి (సాగర్) మండలంలో 138 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గరకనేటి తండా గ్రామపంచాయతీలో జరిగిన ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి చేతుల మీదుగా నిర్మాణం పూర్తయిన 138 ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ విద్యాసాగర్ రెడ్డి, డీఈఈ, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే మండల ప్రజలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి



కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై అసత్య ప్రచారాలు

తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. అటవీ శాఖలో 3,093 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సింగిల్ పోస్ట్ ఖాళీలు 25 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇకపై క్రమంతప్పకుండా రెగ్యులర్ గా నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెల సగటున మూడు నోటిఫికేషన్లు ఇస్తామని, రేపే మూడు కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఉద్యోగ నియామక పక్రియ ఏది ప్రారంభించినా, దానిని గరిష్టంగా ఒక ఏడాది లోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అలాగే.. ఇకపైనిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ మోడ్ లోనే జరుగుతాయని తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తామన్నారు. పరీక్షల్లో ఎలాంటి లోపాలు లేవనే నమ్మకాన్ని అభ్యర్థుల్లో కలిగించడానికే తామంతా పనిచేస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో ఆయన ఒక ప్రాధాన్యత గల విషయాన్ని గుర్తుచేశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని, కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఉద్యోగం రాని మిగతా వాళ్ళు కమిషన్‌పై దుష్ప్రచారం చేయడం సహజమేనని, అయితే అభ్యర్థులు అలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన కోరారు. మొత్తానికి ౼ఉఖాఅ తీసుకొస్తున్న ఈ మార్పులు నిరుద్యోగుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. ఇకపోతే మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణెళి ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని బుర్రా వెంకటేశం తెలిపారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం
## తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
## జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

ఆదిలాబాద్,జూన్1 : ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

## నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ

హైదరాబాద్ : జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# తెలంగాణలో బిజెపికి అధికారం కల్ల

## మతం పేరుతో రాజకీయాలు తగవు
## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని విమర్శలు

హైదరాబాద్,జూన్1 : మతపరమైన విభజన పైన.. మతం అనే సౌధంపైన భాజపా నిలబడి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ముగ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. భాజపా తెలంగాణాలో దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందని ఆ పార్టీ నేతలు ఊదరగొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో భాజపా కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల అసంతృప్తిని చూస్తున్నాం. అందుకే, సీపీఐ శ్రేణులు పోరాటాలు చేయాలి. సమస్య ఎక్కడ ఉంటే.. అక్కడ మనం ఉండాల్సిందే. వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటే కనీసం ఐదు స్థానాల్లో, లేకుంటే కనీసం 15 స్థానాల్లో పోటీ చేసేలా సన్నద్ధం కావాలి. ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు వేధింపులపై 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. ఆగస్టు 6 నుంచి 15 వరకు పాదయాత్రలు చేపట్టాలి. రాష్ట్రంలో బలమైన 40 నియోజకవర్గాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో పాదయాత్రలు చేపట్టాలి. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర.. రాష్ట్ర వైఫల్యాలు ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక సమస్యలను పాదయాత్రల్లో ప్రస్తావించాలి. సెప్టెంబర్ 28వ తేదీన చలో దిల్లీ కార్యక్రమం ఉంటుంది' అన్ని అన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

## తెలంగాణ ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్,జూన్1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, 'పరిపాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల కాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని కేసీఆర్ వివరించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య వైద్యం తదితర సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందనీ కేసీఆర్ తెలిపారు. ఒకప్పుడు ఎడారిలా మారిన తెలంగాణను.. నేడు కోటి ఎకరాల మాగాణంగా మార్చి, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత నాటి పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని కేసీఆర్ ఘంటాపథంగా చెప్పారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తుల నుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలనీ కోరిన ఆయన.. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలనీ సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. ల్గ÷తాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు, సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్టు కేసీఆర్ పేర్కొన్నారు.

# మారేడుపల్లిలో యువకుడి దారుణ హత్య

హైదరాబాద్,జూన్1 : సికింద్రాబాద్ పరిధి మారేడుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో దారుణ హత్య జరిగింది. శ్రావణ్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన మద్యం మత్తులో జరిగిన ఘర్షణగా పోలీసులు చెప్పారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణ్ తన స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగాడు. అయితే నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ విషయంలో వారు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న మరో యువకుడు కత్తితో శ్రావణ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రావణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు

# సంపాదకీయం

## తెలంగాణ మేధావులు ఆలోచించాలి !

తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్‌ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

# భూసారం.. మంటల్లో మాయం



వ్యవసాయం పూర్తయిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరి,మొక్కజొన్న, పత్తి, ఇతర పంటల అవశేషాలను చాలా మంది రైతులు త్వరగా పొలం శుభ్రం చేసుకోవాలనే ఉద్దేశంతో కాల్చివేస్తుంటారు. అయితే ఈ పంట అవశేషాల దహనం తాత్కాలికంగా సులభమైన మార్గంలా కనిపించినా,దీర్ఘకాలంలో రైతులకు, భూమికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. భూసారం తగ్గిపోవడం పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ పదార్థాలు,సూక్ష్మజీవులు నశిస్తాయి. దీని వల్ల భూమి సారవంతత తగ్గి, దిగుబడులపై ప్రభావం పడుతుంది.పొలం ఆరోగ్యం దెబ్బతినడం అవశేషాల దహనం కారణంగా నేలలోని నత్రజని, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు గాలిలో కలిసిపోతాయి. దీంతో రైతులు అదనపు ఎరువులు వేయాల్సి రావడంతో ఖర్చు పెరుగుతుంది. ప్రస్తుతం రైతులు పంట కాలం పూర్తి అయి తదుపరి వచ్చే పంటను త్వరగా వేయడానికి రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నప్పటికీ, దీని వల్ల నేల సారం, పర్యావరణం, మానవ ఆరోగ్యం మరియు వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయి. భారతదేశంలో పంట అవశేషాల దహనం సమస్య భారీ స్థాయిలో ఉంది. ప్రధానంగా వరి, గోధుమ, చెరకు పంటల అవశేషాలే ఎక్కువగా కాల్చబడుతున్నాయి. మొత్తం కాల్చే అవశేషాల్లో వరి అవశేషాల వాటా అత్యధికం. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 500–686 మిలియన్ టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతుండగా, అందులో సుమారు 90–135 మిలియన్ టన్నుల వరకు కాల్చబడుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో 67 వేలకుపైగా పంట దహన ఘటనలు నమోదయ్యాయి. ఇందులో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలు ముందున్నాయి. తెలంగాణలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు మరియు పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. వివిధ పరిశోధనా సంస్థలు మరియు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 180–220 లక్షల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో వరి పంట అవశేషాలు అత్యధికంగా 90–110 లక్షల టన్నులు ఉండగా, మొక్కజొన్న పంట నుండి 35–45 లక్షల టన్నులు, పత్తి పంట నుండి 20–25 లక్షల టన్నులు, మరియు చెరకు పంట నుండి 15–20 లక్షల టన్నుల అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. అదనంగా, పప్పుధాన్యాలు మరియు ఇతర పంటల ద్వారా మరో 20–25 లక్షల టన్నుల అవశేషాలు లభిస్తున్నాయి. వీటిలో వరి అవశేషాలే అత్యధికంగా ఉండి మొత్తం అవశేషాలలో దాదాపు 45–50% వాటాను కలిగి ఉంటాయి. తెలంగాణలో కూడా పంట అవశేషాల దహనం పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ ఘటనలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. 2026 రబీ సీజన్‌లో తెలంగాణలో సుమారు 65.9 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఒక్క ఎకరానికి కనీసం 3 టన్నుల అవశేషాలు వస్తాయని లెక్కిస్తే, దాదాపు 1.97 కోట్ల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.దీని ఫలితంగా భూసారం తగ్గి, భవిష్యత్తులో ఎరువులపై ఆధారపడే పరిస్థితి పెరుగుతుంది.రైతు తక్షణం సమయం ఆదా చేసుకున్నా,దీర్ఘకాలంలో పెట్టుబడులు పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు, ఈ దహనం వల్ల వెలువడే పొగ వాయు కాలుష్యాన్ని పెంచుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో శ్వాసకోశ సమస్యలు, కంటి ఇబ్బందులు,ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశముంది. పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న సమయంలో భూమిని, గాలిని కలుషితం చేసే ఈ విధానం కొనసాగడం ఆందోళనకరం.ఈ సమస్యకు రైతులను మాత్రమే బాధ్యులుగా చూడటం సరైంది కాదు. యంత్రాల కొరత, అవగాహన లోపం,అవశేషాల నిర్వహణకు సరైన ప్రత్యామ్నాయాల లేమి కూడా కారణాలే. ప్రభుత్వాలు సబ్సిడీలతో యంత్రాలను అందించడం, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, అవశేషాలను సేంద్రియ ఎరువులుగా మార్చే విధానాలను ప్రోత్సహించడం అవసరం. ఒకసారి మంటలు వ్యాపిస్తే పక్కనున్న పొలాలు, చెట్లు, విద్యుత్ తీగలు, పశువులకు ప్రమాదం కలిగే అవకాశం ఉంది. పంట అవశేషాలను కంపోస్ట్‌గా మార్చడం పశువుల మేతగా వినియోగించడం మల్చింగ్ విధానంలో నేలపై పరచడం బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం జరుగుతుంది.ప్రతి సంవత్సరం సుమారు 10–15 లక్షల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా.వీటిలో వరి పంట అవశేషాలు 6–8 లక్షల టన్నులతో అత్యధికంగా ఉండగా, మొక్కజొన్న నుండి 2–3 లక్షల టన్నులు, పత్తి నుండి 1–2 లక్షల టన్నులు, మరియు ఇతర పంటల నుండి 0.5–1.0 లక్షల టన్నుల అవశేషాలు లభిస్తున్నాయి.పంట అవశేషాలను కాల్చడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే.మంటల్లో మాయమవుతున్న భూసారం వల్ల భవిష్యత్ వ్యవసాయం,భూసారం, రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించడం అవసరం.నేడు కాల్చిన అవశేషం రేపటి భూసారాన్ని దహనం చేసినట్టే అనే విషయాన్ని ప్రతి రైతు గుర్తించాలి

## మున్ముందు వర్షాభావ పరిస్థితులు

### నీటిని పొదుపుగా వాడుకోవాలన్న మంత్రి

రాజమహేంద్రవరం : వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముందుగానే నాట్లు వేసుకొని పంటలను రక్షించుకోవాలని రైతులకు మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. ముందస్తు నీటి విడుదలతో త్వరగా పంట చేతికి వస్తోందని, దీంతో నష్టాల బారి నుంచి రైతు గట్టెక్కవచ్చాన్నారు. నీటిని పొదుపుగా వాడుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి ఖరీఫ్ సీజన్ సాగునీటిని విడుదల చేసినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతులకు మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఇదిలావుంటే దుక్కి దున్నడం నుంచి పంట విక్రయం వరకు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుతున్న అన్నదాతలకు ఆదాయం అంతంతమాత్రంగానే వస్తోంది. సాగులో తెగుళ్లు, వడగళ్ల వానలు నష్టం మిగల్చగా వరి కోతలతో రైతులకు ఆర్థిక మోత పడుతోంది. ధాన్యాన్ని కల్లాల కు, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, ఇళ్లలోకి తరలించడానికి రవాణా ఛార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. ఇంధనం ధరల హెచ్చు తగ్గులను సాకుగా చూపుతూ యంత్రాలు, ట్రాక్టర్ల యజమానులు అద్దె ధరలను పెంచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీలో ఎకరానికి పెట్టుబడిగా రూ.40 నుంచి రూ.45 వేలు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

## పశ్చమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

### ఆమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం

వాషింగ్టన్ : శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ÷ట్రైర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి.


## కొనసాగుతున్న ఎండల తీవ్రత

### పలు జిల్లాల్లో గతేడాది కన్నా మిన్నగా ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,జూన్1 : రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రుతపవనాలు జాడ ఇంకాలేదు. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగింది. నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి ప్రతాపంతో నిప్పుల కుంపటిగా ఉన్న రాష్ట్రం ఒక్కసారిగా వాతావరణం సాయంత్రం మారింది. ఆదిలాబాద్ జిల్లా రైతులు మార్కెట్ యార్డులో పోసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పదిరోజుల్లో ప్రవేశించనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రుతుపవనాలు జూన్ 10 నుంచి 12 తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాలు రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్టు వెల్లడించింది. వచ్చే నాలుగు రోజులు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు.

## సమదృష్టి సాధ్యమా?

చరాచర ప్రకృతిలోని సకల జీవులను తనతో సమంగా భావిస్తూ, తనలో దర్శిస్తూ, ఇతరుల కష్టసుఖాలకు సహృదయంతో స్పందించేవారిని, పరమ యోగులుగా పరిగణిస్తాను' అంటాడు కృష్ణపరమాత్మ. వ్యక్తి ఎలాగైతే శరీరంలోని అవయవాలను తనవిగా భావిస్తూ అన్నిటినీ సమానంగా ఆదరిస్తాడో, అలాగే తన అంశ అయిన అన్ని జీవరాసులనూ పరమాత్మ సమంగానే చూస్తాడు. పరమాత్మలాగే పరమయోగులూ ప్రపంచంలోని ప్రతి జీవినీ సమదృష్టితో దర్శిస్తారు. జీవకోటీ శ్రేయస్కరమైన మార్గంలో తరించాలనీ తపిస్తారు. 'సమం పశ్యతి' అంటే సమదర్శనం. సృష్టిలో ఒకే విధంగా జనించని అందరినీ సమంగా దర్శించడం సాధ్యమా? ఒక్కొక్కరి బలాలు, బలహీనతలు వేరువేరుగా ఉంటాయి. అలాంటప్పుడు అం దరినీ సమదృష్టితో ఆదరించాలి అనడం వినడానికి బాగుంటుందేమో కాని ఆచరణలో సాధ్యమా? నిజానికది చూసేవారి దృష్టికోణమే కాని, చూడబడేవారికి సంబంధించినది కాదు! కాబట్టి అసాధ్యం కాదు.. సాధన చేస్తే సమదృష్టి అలవడడం జరుగుతుంది. వ్యక్తిలో భౌతిక ఆధ్యాత్మిక పార్శ్వాలలో జాత్యంతరీకరణ జరగాలి. జాతి అంటే స్థాయి. నిజానికి వ్యక్తుల సాధనలో వారి స్థాయిని బట్టి వారి దృష్టి పరిణతి చెందుతుంది. భౌతిక దృష్టికోణంతో పరిశీలిస్తే.. 'నేను నాది, నీవు నీది' అనే భేదభావం కలుగుతుంది. స్థాయి కొంత ఉన్నతమైతే ఎదుటివారిని భౌతికంగా కాకుండా ఆత్మగా భావిస్తాం. భేదమనేది భౌతికమే కాని ఆత్మపరంగా లేదనే సత్యం అవగతమైతే జాతి మత స్థాయి భేదాలకు ప్రాధాన్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూస్తాం. స్థాయిని మరింత పెంచుకున్న సాధకులు అందరిలోనూ పరమాత్మను దర్శించగలుగుతారు. అయితే వారు కూడా భౌతిక జగత్తును పట్టించుకుంటారు.. కాకపోతే ఫలితాలపై ఉదాసీన వైఖరితో కర్మలను ఆచరిస్తారు. సమాజంలో మంచిని మాత్రమే స్వీకరించి చెడును వదిలేస్తారు. పరమయోగులు అత్యున్నత స్థాయికి చెందినవారు.



ఆధ్యాత్మికం

# పట్టుదల, క్రమశిక్షణతోనే అద్భుత విజయాలు సాధ్యం

**● ఐఏఎస్ పరికిపండ్ల నరహరి ● విద్యార్థుల కెరీర్ మార్గదర్శకత్వం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభం**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** "నిరంతర కృషి, క్రమశిక్షణ, లక్ష్యసాధన పట్ల అంకితభావం ఉంటే జీవితంలో ఏ రంగంలోనైనా అత్యున్నత విజయాలు సాధించవచ్చు" అని ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతి, ఉన్నత విద్యా అవకాశాలు, కెరీర్ ప్రణాళికలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఆయన ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా హైదరాబాద్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత విద్యా అవకాశాలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో భాగంగా ప్రతి విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడిన నరహరి, వారి ఆసక్తులు, అభిరుచులు, కెరీర్ లక్ష్యాలను తెలుసుకుని, వాటికి అనుగుణంగా ఎంచుకోవాల్సిన కోర్సులు, ఉన్నత విద్యా అవకాశాలు, ఉద్యోగ రంగంలో స్థిరపడేందుకు అనుసరించాల్సిన మార్గాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు కూడా ఆయన పలు కీలక సూచనలు చేశారు. పిల్లలపై అనవసరమైన మార్కుల ఒత్తిడి తీసుకురాకుండా, వారి సహజ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వారి ఆసక్తులకు అనుగుణంగా కెరీర్ ఎంపికలకు సహకరించాలని సూచించారు. విద్యార్థులకు కెరీర్ సంబంధిత సందేహాల నివృత్తి, నిరంతర మార్గదర్శకత్వం, ఉన్నత విద్యా ప్రణాళికలు మరియు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలపై నిపుణుల సలహాలు అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 7095915728ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సేవ ద్వారా విద్యార్థులు నేరుగా సంప్రదించి విద్యా, ఉద్యోగ, పోటీ పరీక్షల అంశాల్లో అవసరమైన మార్గనిర్దేశం పొందవచ్చని తెలిపారు. సమావేశం అనంతరం నరహరి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎదుర్కొంటున్న అవకాశాల కొరత, సరైన కెరీర్ అవగాహన లోపం, ఆర్థిక పరమైన సవాళ్లు వంటి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యువతకు సరైన సమయంలో సరైన మార్గదర్శకత్వం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న నరహరి, విద్యార్థుల విజయమే భావి సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ, ఈ సమావేశం తమలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, భవిష్యత్ విద్యా, కెరీర్ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు.

# జూన్3 న సైకిల్ ర్యాలీలో అందరం పాల్గొందాం

**● కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ బాధ్యులు**



**కరీంనగర్ టౌన్, జూన్ 1(ది క్రైమ్ న్యూస్):** జూన్ 3న ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, ఏ.జే. పెడల్స్ సంయుక్తంగా నిర్వహించే సైక్లింగ్ ర్యాలీలో ఔత్సాహిక సైక్లిస్టులు, సైక్లింగ్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు, ఇతర బాధ్యులు విజ్ఞప్తిచేశారు. ఈ రోజు నగరంలోని వావిలాలపల్లి లో గల అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతూ 03 జూన్ రోజున ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి ఎలగందల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొని పూర్తి చేసిన సైక్లిస్టులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అన్ని వయస్సుల వారు ఈ ర్యాలీలో తమ సైకిల్‌లతో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు నిత్యం విధిగా సైక్లింగ్ చేయడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ సంక్షోభాల వల్ల చమురు కొరత ఏర్పడడం, చమురు ధరలు పెరగడం వంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తాయని, దీనికి విరుగుడుగా శిలాజ ఇంధన వాహనాల వినియోగాన్ని తగ్గిస్తూ, సైక్లింగ్‌ను ప్రతి ఒక్కరు తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గలవారు 03 జూన్ రోజు ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌరస్తా వద్ద సైకిళ్ళతో హాజరు కావాలని కోరారు. ఈ గోడ ప్రతి ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, కోశాధికారి వి.జగదీశ్వరా చారి, కార్యవర్గ సభ్యులు అఖిల్ రెడ్డి, డా.వడ్లూరి శ్రీనివాస్, ఎం మహేందర్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9032762247 9398230614 నందు సంప్రదించగలరని తెలిపారు.

# రేకుర్తి, విద్యానగర్ పట్టా భూములను 22/ఏ నిషేధిత జాబితా నుండి తొలగించాలి

**● 30 వేల మంది ప్రజల రిజిస్ట్రేషన్ల కష్టాలపై ప్రభుత్వానికి విన్నపం**





**కరీంనగర్ టౌన్, జూన్ 1(ది క్రైమ్ న్యూస్):** పాత రేకుర్తి గ్రామానికి చెందిన రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాల్లోని పట్టా భూములను నిషేధిత చట్టం 22/ఏ (1)(డి) సీలింగ్ యాక్ట్ కింద చేర్చడం వల్ల వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని 19, 20, 21 వ డివిజన్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 నెలలుగా ఇక్కడ రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపివేయడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం అతలాకుతలమవుతోందని వారు పేర్కొన్నారు.కరీంనగర్ పరిధిలోని పాత రేకుర్తి, విద్యానగర్ పరిధిలోని 19, 20, 21 వ మున్సిపల్ డివిజన్లు, 125 సర్వే నెంబర్లలో విస్తరించి ఉన్న 536 ఎకరాలు.16 సర్వే నెంబర్లలో విస్తరించి ఉన్న 115 ఎకరాలు.మొత్తం 6,000 ఇండ్లు, 10,000 ప్లాట్లు, దాదాపు 30,000 మంది జనాభా మరియు 17,000 మంది ఓటర్లు ఈ సమస్యతో ప్రత్యక్షంగా నష్టపోతున్నారు.గత ఒక సంవత్సర కాలంగా రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో అత్యవసర సమయాల్లో (వైద్యం, పిల్లల చదువులు, వివాహాలు) ఆస్తులను అమ్ముకోలేక, బ్యాంక్ రుణాలు పొందలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సాదాసీదా పట్టా భూములను సీలింగ్ యాక్ట్ కింద నిషేధిత జాబితాలో పెట్టడం అన్యాయమని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.ప్రభుత్వానికి,మున్సిపల్ డివిజన్ల ప్రజాప్రతినిధులు, బాధితులు, కాలనీల అసోసియేషన్ల తరపున జిల్లా కలెక్టర్ , రెవెన్యూ శాఖ అధికారులు, ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసారు.తక్షణమే రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.రేకుర్తి, విద్యానగర్ పట్టా భూములను నిషేధిత 22/ఏ జాబితా నుండి వెంటనే తొలగించాలి.నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించి 30 వేల మంది ప్రజల భవిష్యత్తుకు న్యాయం చేయాలని కోరుతున్నాము.రేకుర్తి, విద్యానగర్ 19, 20, 21 వ డివిజన్ల ప్రజలు, కాలనీ వాసులు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

# మధిర మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సామ్యూల్ బెనిడిక్ట్ ఇస్రాయిల్ పాల్



**మధిర , ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మధిర మున్సిపాలిటీ ఇల్లందులపాడులో మర్యాదపూర్వకంగా మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాతను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్ మధిర నూతన కమిషనర్ గా సోమవారం నాడు బాధ్యతలు చేపట్టిన సామ్యూల్ బెనిడిక్ట్ ఇస్రాయిల్ మున్సిపల్ చైర్ పర్సన్ స్వామినేని సుజాతను ఇల్లిందలపాడు గ్రామంలో స్వయంగా పూల బొకేతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కమిషనర్ చైర్‌పర్సన్ సామినేని సుజాతను మున్సిపాల్టీలో ఉన్న సమస్యలను జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధిర మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయలు నిధులతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అండర్ డ్రైనేజీ వర్కుతో పాటు మధిర మున్సిపాలిటీ లో జరుగుతున్న అనేక కార్యక్రమ వివరాలను చైర్మన్ ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత మధిర మున్సిపాలిటీలో జరిగే ప్రతి కార్యక్రమం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశయాలకు అనుగుణంగా ఉండాలని కోరారు. ఎక్కడ అవినీతికి తావు లేకుండా చూడాలని కోరారు. మున్సిపాలిటీలో జరిగే ప్రతి పని పారదర్శకంగా ఉండాలని కోరారు.దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ మధిర మున్సిపాలిటీ అభివృద్ధిలో తగు పాత్ర పోషిస్తానని చైర్ పర్సన్ కు హామీ ఇచ్చారు.

# పరిశుభ్రమైన గ్రామంగా ఉంచుకుందాం

**స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు ప్రచార కార్యక్రమం -సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీరావు**



**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు (ఎస్.జీ. ఎస్.జే) ప్రచార కార్యక్రమం-2026 అవగాహన సదస్సు జరిగింది. ఇందులో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2016 (ఎస్.డబ్ల్యూ. ఎం 2016) ల అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై అవగాహన కల్పించడం జరిగింది.ఘన వ్యర్థాల సరైన నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ మరియు ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలపై వివరించారు.గ్రామపంచాయతీ సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిద్దామన్నారు. శానిటరీ చెత్త, తడి చెత్త, పొడి చెత్త, ప్రత్యేక చెత్త పై అవగాహన కల్పించారు. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు రాబోయే వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నివారణపై ఆమె చర్చించారు. కాబోయే వర్షాకాలంలో బావులలో మురికి కాల్వల లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, రోడ్లపై మురికి నీరు లేకుండా చూసుకోవాలని సర్పంచ్ కోరారు. దోమల నివారణకు కూడా చర్యలు చేపట్టాలని దీనికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, వార్డు సభ్యులు కెక్కర్ల. ఉషా అశోక్, జక్కుల పద్మాచందన్, కలవేన రవి, ఎం.ఎల్.హెచ్.పి కర్రావుల నవ్య, ఏ.ఎన్.ఎం మన్నాల రాణి,ఆశా వర్కర్‌లు అంగూరు విజయలక్ష్మి, మేడ స్వరూప, గడ్డం సునీత, పంజా శాంత, కారోబర్ కొండపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పప్పుల సురేష్





**కరీంనగర్ టౌన్, జూన్1(ది క్రైమ్ న్యూస్):** భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘమైన భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, బిఎంఎస్ నాయకులు పప్పుల సురేష్ నియమితులయ్యారు. కార్మిక ఉద్యమంలో ఆయనకున్న అనుభవం, అంకితభావం,గుర్తిస్తూ సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పప్పుల సురేష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌లు,సేల్స్ రిప్రజెంటేటివ్‌లు , ఫార్మా రంగ ఉద్యోగులు నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని . పెరుగుతున్న పనిభారం, ఉద్యోగ భద్రత లేకపోవడం, లక్ష్యాల పేరుతో మానసిక ఒత్తిళ్లు,కార్మిక చట్టాల అమలులో లోపాలు వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే "ఉద్యోగుల హక్కుల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యం అన్నారు. .రాష్ట్రంలోని ప్రతి మెడికల్ మరియు సేల్స్ ఉద్యోగికి నిలుస్తుందని , సంఘటిత శక్తితో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన హక్కులను సాధించేందుకు నిరంతరంపోరాడుతామన్నారు.పప్పుల సురేష్ నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా బి ఎం ఎస్ నాయకులు,కార్మిక సంఘ ప్రతినిధులు, మెడికల్ మరియు సేల్స్ రంగ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.ఆయన నాయకత్వంలో(బి ఎం ఎస్ ఆర్ యు )మరింత బలోపేతమై ఉద్యోగుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అదేవిదంగా ప్రధాన కార్యదర్శి గా సిహెచ్ .రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గా వి. డిజగదీష్, జాయింట్ సెక్రటరీ గా మహేష్, కోశాధికారి గా క్యాతం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఈ నియామకానికి సహకరించిన బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ రాష్ట్ర నాయకులకు వారంతా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన జి. లక్ష్మీ తాను నాగారం లో కిరాయికి వింటూ కూలి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నానని, తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం అప్పన్న పేట గ్రామానికి చెందిన పద్మ ప్రస్తుతం తనకు రేషన్ దుకాణం ద్వారా సాధారణ కోట మాత్రమే లభిస్తుందని ఒంటరి మహిళలకు ప్రభుత్వం నిబంధనలు ప్రకారం నెలకు 35 కిలోల బియ్యం కార్డు కింద మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ పెద్దపల్లి కు రాస్తూ విచారణ జరిపి అంత్యోదయ కార్డు అర్హత మేరకు మంజూరు చేయాలని అన్నారు.సుల్తానాబాద్ మండలం నారాయణరావు పల్లె గ్రామానికి చెందిన గంధం రాములు గ్రామంలోని హౌస్ నెంబర్ 5-54, లో నివాస గృహంలో ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ప్రహరీ గోడను అక్రమంగా కూల్చేసారని దీనివల్ల 3,50,000 నష్టం జరిగిందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవో కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల రేట్ల పెంపకం బాధాకరం గుగులోతు పటేల్




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్టియు జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం తీగల లాజర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు పటేల్ పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల ఐక్యమత్యం లోపం వల్ల మొట్టమొదటిసారిగా లేబర్ ఆఫీసులో ఉడత బత్యంగా రేట్ల పెంపకం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ ఆఫీసులో జరిగే అవకతవకలను అరికట్టాలని రాడ్ బెండింగ్ కార్మికులు ఎత్తుకుపోయేత్తు 5, 6, 7 బిల్డింగ్ అంతస్తులపై ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ఎత్తు పీటలపై ఎలాంటి రక్షణ కిట్టు లేకుండా పనిచేస్తున్నారు. ఇలా పని చేస్తూ పైనుంచి జారిపడి ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు కనుక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు రక్షణ కిట్టు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే యాజమాన్య వర్గాన్ని అసోసియేషన్ లో నమోదయి ఉన్న మేస్త్రులకు మాత్రమే పని ఇచ్చి ఇంటి నిర్మాణం చేయించుకోవాలని బాధ్యత లేని వారికి ఇచ్చి నిర్మాణ లోపాన్నికి గురి కాకూడదని యజమాని వర్గాన్ని కోరారు. నిర్మాణ రంగా కార్మికులు ఐక్యత గా లేకపోవడం వలన ఇలాంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగ కార్మికులు లేబర్ బోర్డులో నూటికి 60 శాతం మాత్రమే నమోదయి ఉన్నామని మిగతా 40 శాతం కూడా నమోదు చేసుకోవాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు అలాగే రెన్యువల్ అయిపోయిన కార్డులను 90 రోజులు లోపే చేయించుకుంటే రెన్యువల్ అవుతున్నాయి. అంతకుమించితే కావట్లేదు కనుక నిజమైన కార్మికుడికి షరతులు లేకుండా ఎప్పుడైనా రిన్వల్ చేయించుకునేలా ఏర్పాటు చేయాలని అలాగే కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 29 చట్టాలకు కుదించి అందులో నుంచి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురాబోతుంది. ఈ నాలుగు లేబర్ కోడ్లవల్ల కార్మికులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది కనుక ఆ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు ఉబ్బని దాసు, యల్ సైదారావు, కాంపాటి పుల్లయ్య, నారపాక అవినాష్, నారపాక ఉపేందర్, కోట రాజు, షేక్ బాషా, నవీన్, అనిల్, రమేష్, శాంతయ్య, భద్రయ్య, రాము, వెంకన్న, భాస్కర్, సీతయ్య, కాంతయ్య, మోహన్ రావు, వెంకటేశ్వర్లు, సతీష్, నరసింహారావు, గురవయ్య వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** గుర్తింపు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలను అడ్మిషన్ ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆయా ఆయా పాఠశాలను సీజ్ చేసి ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఖమ్మం జిల్లా సమితి అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా, మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకుండానే అడ్మిషన్ చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయి అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి చోద్యం చూస్తున్నారే తప్ప గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆ పాఠశాలలో పై చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వ అధికారులు గానీ దొంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను సంతలో సరుగ్గా మార్చేశాయి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆయా విద్యా సంస్థలు మార్కెట్ కేంద్రాలుగా తలపిస్తు .మార్కెట్ చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపార పరం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా ఆయా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అడ్మిషన్స్ తీసుకుంటే డొనేషన్లు బుక్స్ కుసపరేట్ యూనిఫామ్ సపరేట్ ఫీజులు వసూలు దందా కీ పురికలుపుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు 25% ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ, లుకు లక్ష పది ,లక్ష ఇరవై వేలు అంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఫీజుల మోత మోగిస్తున్నాయన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలని తల్లిదండ్రుల ఆశను ఆశరాగా మలుచుకున్న. కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు దోపిడీకి పురి కలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఈ జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్లతో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు బనాయించి ఫీజులు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర మనోజ్ ,జిల్లా నాయకులు పవన్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హాలియాలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు





**నల్గొండ ప్రతినిధి, జూన్ 1(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను నేడు గృహప్రవేశ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పేదలకు గృహవసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన నివాసాన్ని అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున గృహప్రవేశాలు జరగడం లబ్ధిదారులకు మరింత ఆనందాన్ని కలిగించిందన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 55 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, మున్సిపాలిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు, 4వ వార్డు సలహాదారు కడమంచి శీను, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎం.డి. మజార్ మొయినుద్దీన్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 10వ వార్డు కౌన్సిలర్ సలహాదారు పిల్లి ఆంజనేయులు, 11వ వార్డు కౌన్సిలర్ దీపావత్ ప్రసాద్ నాయక్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, కో-ఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి, ఎం.డి. రషీద్ తదితర ప్రజాప్రతినిధులు, స్థానిక పెద్దలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, హౌసింగ్ శాఖ అధికారులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ, హౌసింగ్ శాఖ అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశారు.

## ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

**పది ఇందిరమ్మ గృహాలను ప్రారంభించిన సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీరావు**





**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో సోమవారం పది ఇందిరమ్మ గృహాలను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ప్రారంభించారు. ప్రభుత్వము నిర్మించిన ఈ గృహాలను అన్ని గ్రామాలలో ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించిన విషయం విధితమే. ఈ క్రమంలో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగా ప్రస్తుతము 97 గృహాలు వివిధ దశలో నిర్మాణం పూర్తయ్యాయని సర్పంచ్ పల్లె ప్రతిమ.పీవీ రావు తెలిపారు. ప్రభుత్వము నిర్దేశించిన విధంగా పది గృహాలలోకి ఆమె స్వయంగా వెళ్లి రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి గృహాల ను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, హౌసింగ్ ఏఈ ఎన్ రేఖ, వార్డు సభ్యులు కెక్కర్ల. ఉషా అశోక్, జక్కుల పద్మాచందన్, కలవేన రవి, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు భద్రపు శకుంతల, లలిత తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలి

**- మే నెల బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించిన ఎపిఎ జిఎం కొలిపాక**




**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** మే నెల బొగ్గు ఉత్పత్తి వివరాలను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. వారు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు మే నెలలో నిర్దేశించిన 0.16 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.17 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలని అన్నారు.

## జిల్లాలో 'పర్యావరణ వారోత్సవాలు

**మొక్క నాటిన జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా, తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలను జూన్ 1 నుండి జూన్ 12 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మొక్క నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాబోయే 12 రోజుల పాటు జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం అటవిశాఖ ఆధ్వర్యంలో, రాంపల్లి,ఏ క్లాస్పూర్ గ్రామాలలో ప్రజలకు పర్యావరణ అవగాహన సదస్సులను, అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను ,పర్యావరణ సమతుల్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ అటవీ శాఖ అధికారులు ఈ. సతీష్ కుమార్, వినయ్ నాయక్ ,దేవదాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులను సన్మానించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్



**రామగిరి,జూన్01(ది క్రైమ్ న్యూస్):-** మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నూతనంగా బదిలీపై మంథనికి వచ్చిన అటవీశాఖ ఉద్యోగులను సన్మానించారు. సోమవారం మంథని అటవీ శాఖ కార్యాలయంలో సెక్షన్ బీట్ ఆఫీసర్ మంగిలాల్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్ పెద్దపల్లి నుండి మంథనికి బదిలీపై వచ్చారు. వీరిని అనంతరెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. మంథనిలో పనిచేస్తున్న రేంజ్ ఆఫీసర్ ఎంవి నాయక్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్ మంథని నుండి పెద్దపల్లి రేంజ్ కు బదిలీ అయ్యారు. వీరిని ఘనంగా సన్మానించి సత్కరించారు.

# జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసుల ప్రత్యేక తనిఖీలు..





**జమ్మికుంట, జూన్ 1 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం సహాయంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సామాన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదక ద్రవ్యాల రవాణా జరిగే అవకాశాల నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాల విక్రయం లేదా రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## ఓటర్ వెరిఫికేషన్ పై కాంగ్రెస్, టిఆర్ఎస్ ద్వంద వైఖరి: ఆకుల రాజేందర్



**జమ్మికుంట, జూన్ 1 (ది క్రైమ్ న్యూస్):** ఓటర్ వెరిఫికేషన్‌కు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ఆరోపించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ 11 సార్లు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించిందని, ప్రస్తుతం జరుగుతున్నది 12వసారి అని పేర్కొన్నారు. ఇది కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరిగే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనని, దీనిని బీజేపీ కార్యక్రమంగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. ఓటరు జాబితాల్లో చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓట్లు ఉన్నాయని, వాటిని గుర్తించి సరిచేయడానికే ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో 50 నుంచి 100 వరకు ఇలాంటి ఓట్లు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాల్లో ప్రజలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి నిర్వహించే ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా తమ ఓటు వివరాలను సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళన వల్ల అక్రమాలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆకుల రాజేందర్ విమర్శించారు.

## సింగరేణి మండలంలో పర్యటించిన బానోత్ మనీషా లక్ష్మి (మదన్ లాల్)





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** సింగరేణి మండలం లో విస్తృతంగా పర్యటించిన వైరా నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ కుమార్తె బానోత్ మనీషా లక్ష్మి, భాగ్యనగర్ తండా లో కె కె ట్రేడర్స్ అజ్మీరా కిరణ్ (ఫెర్టిలైజర్ షాప్) ని రిబ్బన్ కట్ చేసి మనీషా లక్ష్మి ప్రారంభిచారు. అనంతరం సింగరేణి మండలం మాజీ జడ్పీటీసీ వాంకోడొత్ జగన్ ఇంట్లో తేనీటి విందు లో మనీషా లక్ష్మి హాజరయ్యారు. సింగరేణి మండల బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భాగ్యనగర్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సిలర్ – సుజాత ఇంట్లో తేనీటి విందులో మనీషా లక్ష్మి పాల్గొన్నారు. కారేపల్లి లో ఉద్యమకారుడు బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు సోముధుల నాగరాజు కి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కారేపల్లి లో జిల్లా మైనారిటీ నాయకులు ఎస్ కె గౌసద్దీన్ ఇంట్లో తేనీటి విందు లో మనీషా లక్ష్మి పాల్గొన్నారు. వారి వెంట సింగరేణి మండలం మాజీ జడ్పీటీసీ వాంకొడొత్ జగన్ నాయక్, డోకేన రవీందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్. సుజాత. ఎస్ కే గౌసద్దీన్, మాజీ సర్పంచ్ లు జర్పాల హచ్చు, మోహన్, జడల కళ్యాణ్, ధారావత్ వికాస్, బానోత్ రాజేష్, మణికొండ నాగేశ్వరరావు, తెలగొల్లా రామారావు, మురళి, పేర్ని వెంకటేశ్వర్లు, పొడుగు హరీష్, రమేష్, మూతి కోటేశ్వరరావు, అజ్మీరా రవి, వెంకట్, ఖలీల్ ఖాన్, సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# 24 పార్కుల అభివృద్ధికి శ్రీకారం..

## • రూ.1.40 కోట్ల పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన



**పటాన్చెరు (రామచంద్రాపురం), జూన్ 1(ది క్రైమ్ న్యూస్ ):** అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో 24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, ప్రతి పార్కును ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-2 కాలనీ పార్కు, హుడా కాలనీ పార్కు-2లో రూ. 1.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణాలు మరియు గ్రామాల్లో నూతన పార్కుల ఏర్పాటు ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. పార్కులు పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణంలో నడక, వ్యాయామం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. పార్కుల అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుతో పాటు ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజలు పార్కులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం తహసీల్దార్ సరస్వతి, పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలిత సోమిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డీఈ కృష్ణవేణి, యూబీడీ మేనేజర్ విక్రమ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ.ఐ.టి అడ్వాన్స్ డ్-2026 ఫలితాలలో "అల్ఫోర్స్" అఖండ విజయం





**కరీంనగర్ టౌన్, జూన్01(ది క్రైమ్ న్యూస్):** ఐ.ఐ.టి అడ్వాన్స్- 2026 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాదించిన కె. ప్రజ్ఞాన్ దీపక్ 75 వ ర్యాంకు సాధించగా, సి. హెచ్. లక్ష్మీహాసిని 400, ఎన్. రత్నప్రకాశ్ 497, బి. లిఖిత్ సాయి 785, ఎమ్. వశిష్ఠ 800, బి. స్పందన 954, కె. ధనుష్ 1294, ఎమ్. జోహన్ 1400, పటేల్ అక్షయ 1488, సి. హెచ్. అభిరామ్ రావు 1618, ఎ. సత్యవర్ధన్ 1678 ర్యాంకులు సాధించి "అల్ఫోర్స్" ఖ్యాతిని మరింత పెంచారని ఈ సందర్భంగా తెలియజేయుచున్నాను. 1,000 లోపు 6 మంది విద్యార్థులు, 2,000 లోపు 11 మంది విద్యార్థులు, 3,000 లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడము విశేషం.పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిషలు కృషి ఇంతటి ఘనవిజయానికి తోడ్పడ్డాయి.ఎప్సెట్-2026లో మా అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారు.కరీంనగర్ జిల్లాలో ప్రప్రథమంగా ఐ.ఐ.టి. కోచింగ్ అందించి అనేక మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐ.ఐ.టి.లలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దిన మొదటి మరియు ఏకైక విద్యాసంస్థ అల్ఫోర్స్ అని ఈ సందర్భంగా తెలియజేయుచున్నాను. ప్రతీ సంవత్సరం అల్ఫోర్స్ అందించిన అద్భుతమైన ఐ.ఐ.టి కోచింగ్ ద్వారా ఐ.ఐ.టిలలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగడం విశేషం.రాబోయే నీట్-2026 ఫలితాలలో కూడా మా అల్ఫోర్స్ చిన్నారులు అద్భుత ర్యాంకులు సాధిస్తారని నేను విశ్వసిస్తున్నాను అని, ఐఐటి-2026 ఫలితాలలో అద్భుత ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ అణిముత్యాలను మరియు వారి తల్లిదండ్రులను మన: స్ఫూర్తిగా అభినందిస్తున్నాను ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన మా అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేయుచున్నాను అని అన్నారు.

# మాదిగలు విద్యారంగంలో ముందుండాలి


## • విద్యారంగంలో ఆయుధంగా మాదిగల ముందుకు వెళ్లాలి:కురపాటి సునీల్ మాదిగ





**మధిర ప్రతినిధి జూన్ 1(ది క్రైమ్ న్యూస్):** మధిర నియోజవర్గం బోనకల్ మండలం అధ్యక్షులు బలవంతపు నరసింహారావు మాదిగ ఆధ్వర్యంలో మోటమర్రి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కురపాటి సునీల్ మాదిగ ఎంఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఊటుకూరి రత్నాకర్ మాదిగలు పాల్గొని మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన సర్వే నివేదికలో అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడిన కులంగా మాదిగలు ఉన్నారని అన్నారు.అందువల్ల మాదిగలకు విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం మంద కృష్ణ మాదిగ గారు నిర్ణయం తీసుకొని ప్రతి గ్రామాల్లో చైతన్య సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అందులో బాగానే గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు తెలిపారు.ప్రసుత్తం తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతున్నందున 9% రిజర్వేషన్ సదుపాయాలు మాదిగలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ సమస్యలు మొదలగు ఇబ్బందుల వల్ల మాదిగలు చదువులకు దూరం కావద్దు అని అన్నారు.అత్యంత పేదరికంలో ఉన్న మాదిగలు అభివృద్ధిలోకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు.ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని రకాల మార్గాలను ఉపయోగించుకుందాం అని అన్నారు. 30 ఏళ్ల పోరాటం చేసి సాధించిన వర్గీకరణ ఫలాలను అందుకొని ఉన్నత విద్యారంగంలో , ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి రాణించాలని పిలుపునిచ్చారు. మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెలని నిర్మాణం చేసుకోవాలని కోరారు. జులై 7 న మాదిగ జాతి పండుగగా ఎమ్మార్పీఎస్ జెండా పండుగ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మోటమర్రి గ్రామ శాఖ అధ్యక్షులు చిలుకూరు అప్పారావు మాదిగ కన్య పోగు ప్రభాకర్ మాదిగ యాంగల ప్రసాద్ మాదిగ మోటమర్రి గ్రామ మాదిగ మహిళ విద్యార్థులు విద్యార్థులు పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ఫ్లైఓవర్, నాలుగు లైన్ల రహదారి పనులు ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి, అమీన్పూర్ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీహెచ్ఈఎల్ చౌరస్తా నుండి అమీన్పూర్ బంధంకొమ్ము వరకు జాతీయ రహదారిని అనుసంధానించే ఫ్లైఓవర్, నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. భారతీయ జనతా పార్టీ మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్‌ల కృషి, ప్రజల సహకారం, జీహెచ్ఎంసీ అధికారుల చొరవతో ఈ పనులు ప్రారంభమైనట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి పనులను పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో రవికుమార్ యాదవ్ మాట్లాడారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుండి అమీన్పూర్ బంధంకొమ్ము వరకు నాలాపై ఫ్లైఓవర్, నాలుగు లైన్ల రహదారి నిర్మాణం శేరిలింగంపల్లి, అమీన్పూర్ ప్రజల ఎన్నో ఏళ్ల కల అని ఆయన పేర్కొన్నారు. ఈ రహదారి కోసం గతంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ సమస్యను ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావుల దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రత్యేక శ్రద్ధ చూపి జీహెచ్ఎంసీ అధికారులతో పలుమార్లు సమావేశమయ్యారని తెలిపారు. రఘునందన్ రావు చొరవతో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి ప్రాంతాన్ని పరిశీలించి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. ఇప్పటికే నాలా డైవర్షన్ పనులు కూడా ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులుగా ఉన్న స్థానిక ఎమ్మెల్యేలు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజల సహకారం, బీజేపీ ఎంపీల కృషి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, సింధు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, రాజు శెట్టి, మల్లేష్ గౌడ్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నవ శకం ఆధ్వర్యంలో,మర్లపాడు విద్యార్థినిలకు సన్మానం



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మధిర మండలం మర్లపాడు గ్రామానికి చెందిన విద్యార్థినిలు బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన సందర్భంగా సోమవారం నాడు నవ శకం మధిర నియోజకవర్గం కార్యాలయంలో నవ శకం అధ్యక్షులు, కూరపాటి సురేష్ ఆధ్వర్యంలో,సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసి, వారిని శాలువాతో సత్కరించి,, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ , యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నవ శకం ఫౌండర్ రమేష్ మాట్లాడుతూ, మా మధిర,నియోజకవర్గ కార్యాలయంలో మొట్టమొదటి కార్యక్రమం విద్యార్థులను సన్మానించుట ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు, ఈ యొక్క కార్యక్రమంలో ఎర్రుపాలెం మండలం నవ శకం అధ్యక్షులు మారబత్తుల మోహన్ రావు మధిర మండలం నవ శకం గౌరవ అధ్యక్షులు వేల్పుల పవన్ కళ్యాణ్ ఎమ్మార్పీఎస్ నాయకులు సగుర్తి శ్యామ్ గారు, వివిధ హోదాలలో ఉన్న పెద్దలు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలి

## - మే నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించిన

## ఆర్.జి-త్రీ జి.ఎం సుంకర



**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** మే నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.వారు మాట్లాడుతూ మే నెలలో రామగుండం-త్రీ ఏరియాకు నిర్దేశించిన 3.20 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 3.68 లక్షల టన్నులు అనగా 115 శాతం బొగ్గు ఉత్పత్తి, తో పాటు, కంపనీ షావల్స్, ఆఫ్ లోడింగ్ కు నిర్దేశించిన 33.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి)వెలికితీత లక్ష్యానికి గాను, 33.78 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 101 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 5.76 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ మే నెలలో ఓ.సి.పి-వన్ గనికి నిర్దేశించిన 0.45 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.26 లక్షల టన్నులు అనగా 280 శాతం, ఓ.సి.పి-టు గనికి నిర్దేశించిన 2.75 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.42 లక్షల టన్నులు అనగా 88 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిష్తుత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు.రానున్న వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను తూచ తప్పక పాటించాలని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.

# ఆర్జీ -త్రీ , ఏపిఏ ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే

## -తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సన్మానం




**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం-త్రీ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం జరిగినదని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు ఇందులో కొత్తగూడెంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్ కు ఓసిపి-వన్ నుండి అడిషనల్ మేనేజర్ బైరి రమేష్, ఏఎల్ పి నుండి సూపరిండెంట్ ఇంజనీర్ సి.హెచ్.బాలరాజు లు ఎంపికయ్యారని వీరిని కొత్తగూడెంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సన్మానించబడునని, అలాగే ఏరియా స్థాయి లో ఓసిపి-టు నుండి ఇపి ఆపరేటర్ తటికంటి శ్రీనివాస్, ఏఎల్ పి గని నుండి ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ గాన్ల సురేష్ లు ఎంపిక కావడం జరిగినదని వీరిని స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణము నందు మంగళవారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సన్మానించడం జరుగుతుందని వారు తెలిపారు.

# కిష్టయ్యపల్లిలో పేదల భూములపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

## పేదల పట్టా భూములను రక్షిస్తాం: కౌన్సిలర్ ఇంద్రసేన



**పటాన్చెరు(గడ్డపోతారం), జూన్ 1(ది క్రైమ్ న్యూస్) :** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో సర్వే నంబర్ 42లో గతంలో పేదలకు కేటాయించిన 91 ఇళ్ల స్థలాల భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను కాపాడాలని, తమ భూములు తమకే దక్కేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టాదారులు మాట్లాడుతూ, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కిష్టయ్యపల్లి 15వ వార్డు కౌన్సిలర్ ఇంద్రసేన వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాకు గురికాకుండా కాపాడుతామని, అవసరమైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పేదల హక్కులను పరిరక్షించేందుకు తాను అండగా ఉంటానని, లబ్ధిదారుల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ ఇంద్రసేన భరోసా ఇచ్చారు.

# విశింగ్ - సిమ్ స్వాప్ సైబర్ మోసాల ముఠా గుట్టురట్టు

## ● రూ.77.75 లక్షల సైబర్ మోసం కేసులో కీలక నిందితుడి అరెస్ట్ ● రూ.7 లక్షల నగదు స్వాధీనం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠాను ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. విశింగ్, సిమ్ స్వాప్, ఓటీపీ మళ్లింపు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలకు పాల్పడిన ఈ ముఠా ద్వారా రూ.77.75 లక్షల మేర మోసం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితులు తమను సిటీబ్యాంక్ ప్రెస్టీజ్ క్రెడిట్ కార్డు విభాగం అధికారులుగా పరిచయం చేసుకుని బాధితులను సంప్రదించేవారు. టెలికాం శాఖ ధృవీకరణ పేరుతో ఈ-సిమ్‌ను ఫిజికల్ సిమ్‌గా మార్చాలని నమ్మబలికేవారు. అనంతరం హానికరమైన యాప్‌లతో కూడిన మొబైల్ ఫోన్లను కొరియర్ ద్వారా బాధితులకు పంపించేవారు. బాధితులు ఆ పరికరాల్లో తమ సిమ్ కార్డులను ఉపయోగించిన వెంటనే ఓటీపీలు, బ్యాంకింగ్ అలర్ట్‌లు నిందితుల వద్దకు చేరేవి. దీంతో వారు బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి అక్రమంగా ప్రవేశించి భారీ మొత్తాలను ఆన్‌లైన్ ద్వారా దోచుకునేవారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సెలీం మండల్ (30) ను ఈ ఏడాది మే 11న ట్రాన్సిట్ వారెంట్‌పై అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం పోలీసు కస్టడీలో విచారించగా, పశ్చిమ బెంగాల్‌లోని అతని నివాసంలో నుంచి రూ.7 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితుల వద్ద నుంచి రూ.15 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా అడిగే ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్‌కు సంబంధించిన సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని పోలీసులు సూచించారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు లేదా అనుమానాస్పద కొరియర్‌ల ద్వారా వచ్చిన మొబైల్ పరికరాల్లో తమ సిమ్



కార్డులను ఉపయోగించవద్దని హెచ్చరించారు. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు.

# కార్మిక ప్రాంతం రామవరంలో డిస్పెన్సరీ యధావిధిగా నడిపించాలి

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేతను యాజమాన్యం తక్షణమే విరమించుకో వాలని, డిస్పెన్సరీని పునరుద్ధరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం సింగరేణి ప్రధాన వైద్యశాల ముఖ్యవైద్యాధికారి(సి ఎం ఓ)కిరణ్ రాజ్ కు ఎఐటియుసి నాయకులు వినతిపత్రం అందజేశారు,ఈ సందర్భంగా ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లడుతూ రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతో కాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ డిస్పెన్సరీలో కొత్త వైద్యుల నియామకం చేపట్టి,సరైన స్టాఫ్ నియమించి కార్మికులకు మందులు ఇచ్చేలా చూడాలని కోరారు, ఇక్కడ పనిచేసే ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో, కొత్తవారిని నియమించకుండా డిస్పెన్సరీకి ఏకంగా సీల్ చేయడం సరైంది కాదన్నారు. ఈ డిస్పెన్సరీని మూసివేయడం వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవలకు సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర భారంగా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం వైద్యులను, సిబ్బందిని నియమించి ఆస్పత్రిని రామవరం డిస్పెన్సరినీ యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన (సి ఎం ఓ) కిరణ్ రాజ్ డిస్పెన్సరీ భవనం పునర్నిర్మాణం చేసి త్వరితగతిన సమస్యను పరిష్కరించి రామవరం డిస్పెన్సరీ లో డాక్టర్



ను, స్టాఫ్ ను నియమించి పునరుద్ధించేల చేస్తామని హామీ ఇచ్చారు. కావున కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ రామవరం డిస్పెన్సరీ ఏరియా అధీనంలో ఉంది కాబట్టి డిస్పెన్సరీ భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, సహాయ కార్యదర్శులు గట్టయ్య,రాము, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, పిట్ కార్యదర్శిలు అనంతలక్ష్మి, మధు కృష్ణ, కమల్, ఆఫీస్ బ్యారర్స్ నాగయ్య, కర్రు రమేష్, సీనియర్ నాయకులు మర్రి గోపి, లక్ష్మీనారాయణ, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హాలియాలో గ్యాస్ సిలిండర్ పేలుడు.. ఎగిసిపడిన మంటలు



**నల్గొండ ప్రతినిధి, జూన్ 1(ది క్రైమ్ న్యూస్):**హాలియా పట్టణంలో ఆదివారం ప్రమాదవశాత్తు వంట చేస్తుండగా గ్యాస్ లీకై సిలిండర్ పేలిన ఘటన కలకలం రేపింది. సిలిండర్ పేలుడుతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి, హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. అప్రమత్తమైన పోలీసులు, ఫైర్ సిబ్బంది సమన్వయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఎవరైనా గాయపడినట్లు సమాచారం ఉంటే అధికారులు వెల్లడించాల్సి ఉంది. ఫైర్ సిబ్బంది, పోలీసులు ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# శుభ్రమైన గ్రామం - మన అందరి లక్ష్యం

**-మన చెత్త -- మన బాధ్యత -సుప్రీం కోర్టు తీర్పు 2026 నేపథ్యంలో స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు ప్రచార కార్యక్రమం - ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 పై అవగాహనా కార్యక్రమం -సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి -కొమ్మురయ్య**



**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రాజాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు "సుప్రీం కోర్టు తీర్పు--2026" చెత్త నిర్వహణకు సంబంధించిన నూతన మార్గదర్శకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త ప్రత్యేక చెత్తలను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. ఇంటి వద్దనే చెత్తను వర్గీకరించడం ద్వారా గ్రామ పరిశుభ్రత మెరుగుపడటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వివరించారు.అలాగే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని, నిబంధనలను పాటించని వారిపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలియజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం గ్రామపంచాయతీకి సహకరించాలని గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్,వార్డ్ సభ్యురాలు పుల్లెల సుజాత, కాదాసి ఓదెమ్మ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు పుల్లెల సుజాత, కాదాసి ఓదెమ్మ గ్రామ కార్యదర్శి దాసరపు కిరణ్ ,పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం లో పేదల సొంతింటి కల నిజమైన వేళ

**కల్వచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం**

**సర్పంచ్ రెండ్లశారద-కుమారస్వామి**



**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన సౌమిత్రి లావణ్య, బొల్లపల్లి లావణ్య-భాస్కర్, మెడగొని వర్షిత-వెంకటేష్ కుటుంబాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి అధికారికంగా ప్రారంభించడం జరిగింది.ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సొంత ఇంటి కల సాకారం కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ హౌసింగ్ ఏఈ రేఖ, గ్రామ కార్యదర్శి చిలికాని శ్రీధర్, కారోబార్ దొడ్డి పార్టీ కనకయ్య, వార్డు సభ్యులు రోడ్డు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన గ్రామం - ఆరోగ్యకరమైన సమాజం

**-స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు ప్రచార కార్యక్రమం**

**-ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం**

**-సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి**



**రామగిరి,జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు (గా+టాజీ) ప్రచార కార్యక్రమం - 2026 లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2016 (గాజెవీ రూల్స్ , 2016) ఈ అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎంపీఓ సమ్మిరెడ్డి ఘన వ్యర్థాల సరైన నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్యాల పద్మ , రేండ్ల కుమారస్వామి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, తాజా మరియు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల నివాసితులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, శ్రేయోభిలాషులు, పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది అమరులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం అనేది అమరుల త్యాగాలను స్మరించుకునే గర్వకారణమైన రోజు అని అన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# పన్నూర్ గ్రామంలో ఘనంగా "అంగన్వాడి బాట" కార్యక్రమం

**- సర్పంచ్ చిందం మహేష్, ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి చేతుల మీదుగా చిన్నారులకు యూనిఫాంల పంపిణీ**



**రామగిరి, జూన్ 01(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్, ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరిలు అంగన్వాడీ కేంద్రంలో ప్రీ-స్కూల్ విద్యను అభ్యసిస్తున్న చిన్నారి విద్యార్థులకు నూతన స్కూల్ యూనిఫాంలను చిన్నారులకు యూనిఫాంలను అందజేసి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిందం మహేష్ మాట్లాడుతూ, అంగన్వాడి బాట" చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు విద్య పట్ల ఆసక్తిని మరింత పెంచుతాయని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఐదేళ్ల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.గ్రామాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విజయవంతానికి పంచాయతీ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు చేతి రాజ్యలక్ష్మి, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 18 కిలోల గంజాయిని పట్టించిన ప్రైవేట్ బస్ కండక్టర్‌కు డీసీపీ రితిరాజ్ సన్మానం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అప్రమత్తతతో వ్యవహరించి సుమారు 18 కిలోల గంజాయి పట్టివేతకు కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కండక్టర్‌ను కుకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం శాలువాతో సత్కరించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 30వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులు హైదరాబాద్‌లోని మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఔరంగాబాద్‌కు వెళ్లేందుకు షిర్డీ వెళ్తున్న ప్రైవేట్ బస్సులో ఒక లగేజీ బ్యాగ్‌ను ఎక్కించే ప్రయత్నం చేశారు. అయితే ఆ బ్యాగ్‌పై అనుమానం వచ్చిన బస్ కండక్టర్ అందులో ఉన్న వస్తువుల గురించి వారిని ప్రశ్నించాడు. దీనికి ఆ వ్యక్తులు సరైన సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో అనుమానం మరింత బలపడడంతో కండక్టర్ ఆ లగేజీ బ్యాగ్‌ను మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో సుమారు 18 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఆరుగురు వ్యక్తులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గంజాయి పట్టివేతలో కీలక పాత్ర పోషించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కండక్టర్ అప్రమత్తతను అభినందిస్తూ కుకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ఆయనను శాలువాతో సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.ం

# ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ఆహ్వానం

**- ఈనెల 3, 4 తేదీలలో జరగనున్న సమావేశాలు**



**కరీంనగర్ టౌన్, జూన్01(ది క్రైమ్ న్యూస్):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే అల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశాల్లో గౌరవ అతిథిగా పాల్గొనాల్సిందిగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం పలికింది. ఈ మేరకు సోమవారం రోజున ఋషికేష్ నగరపాలక సంస్థ నుండి మేయర్ కోలగాని శ్రీనివాస్ కు ఆహ్వాన పత్రికను పంపించారు. జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి తో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, రాజ్యసభ, లోక్ సభ సభ్యులు హాజరుకానున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి , ఆహ్వాన కర్త మనోజ్ గుప్తా, సహా ఆహ్వాన కర్త , ఋషి కేష్ నగరపాలక సంస్థ మేయర్ రణజాయ్ పాన్వర్ ల ఆహ్వానం మేరకు మేయర్ కోలగాని శ్రీనివాస్ సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రధానంగాఈ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల మేయర్లు పాల్గొని పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

# జూన్ 6 నుంచే నాన్‌స్టాప్ క్రికెట్ ధమాకా..

## స్పోర్ట్స్

క్రికెట్ ప్రేమికులను రెండు నెలల పాటు ఉర్రూతలూగించిన ఐపీఎల్ 2026 సీజన్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ లీగ్‌లో కింగ్ విరాట్ కోహ్లీ అజేయంగా 75 పరుగులు చేసి ఆర్సీబీని గెలిపించి తన సత్తా చాటాడు. అయితే ఐపీఎల్ వినోదం ముగియడంతో ఇక ఫ్యాన్స్ అందరి కళ్ళు అంతర్జాతీయ క్రికెట్‌పై పడ్డాయి. గత మార్చి నెలలో టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత టీమ్ ఇండియా ఆటగాళ్లు ఐపీఎల్‌లో బిజీగా ఉండటం వల్ల ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. కానీ ఇప్పుడు ఐపీఎల్ ముగియడంతో వారం తిరక్కుండానే జూన్ 6 నుంచి భారత జట్టు మళ్లీ రంగంలోకి దిగుతోంది. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఏమాత్రం గ్యాప్ లేకుండా శుభ్‌మన్ గిల్ వంటి స్టార్ ప్లేయర్లతో కూడిన టీమిండియా జూన్ 6 నుంచి మైదానంలోకి అడుగుపెట్టబోతోంది. దీనికి న్యూ చండీగఢ్ వేదిక కానుంది. జూన్ 6 నుంచి జూన్ 10 వరకు భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఒకే ఒక్క చారిత్రాత్మక టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ టెస్ట్ మ్యాచ్ ముగిసిన వెంటనే జూన్ 13 నుంచి జూన్ 20 వరకు ఈ రెండు జట్ల మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగబోతోంది. ఈ సిరీస్‌తో భారత్ లాంగ్ ఇంటర్నేషనల్ సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. అఫ్గానిస్తాన్ సిరీస్ పూర్తి కాగానే టీమ్ ఇండియా విదేశీ పర్యటనలకు బయలుదేరుతుంది. జూన్ 26 నుంచి జూన్ 29 వరకు ఐర్లాండ్ పర్యటనలో




భాగంగా భారత్ 2 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆ వెంటనే జూలై నెలలో ఇంగ్లాండ్‌తో భారీ సిరీస్ షెడ్యూల్ అయింది. జూలై 1 నుంచి జూలై 11 వరకు ఇంగ్లాండ్ గడ్డపై 5 మ్యాచ్‌ల భారీ టీ20 సిరీస్, ఆ తర్వాత జూలై 14 నుంచి జూలై 19 వరకు 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనున్నాయి. ఈ ఇంగ్లాండ్ పర్యటన భారత జట్టుకు అత్యంత ప్రతిష్టాత్మకం కానుంది. ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే జూలై 23 నుంచి జూలై 26 వరకు జింబాబ్వే దేశంలో భారత్ 3 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇక ఆగస్టు నెలలో టీమిండియా పొరుగు దేశమైన శ్రీలంకలో పర్యటించాల్సి ఉంది. లంకతో భారత్ 2 టెస్ట్ మ్యాచ్‌లు, అలాగే 3 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. అయితే ఈ శ్రీలంక పర్యటనకు సంబంధించిన ఖచ్చితమైన తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.



## అవార్డులన్నీ వైభవ్ సూర్యవంశీకే..

అవార్డులన్నీ వైభవ్ సూర్యవంశీకే..యూనివర్సల్ బేబీ బాస్‌గా పేరొందిన వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026లో పెను విధ్వంసం సృష్టించాడు. 2025లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లోనే సెంచరీ బాది ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసి ఇండియన్‌గా నిలిచాడు. ఈ ఏడాది కూడా సిక్సర్ల మోత మోగించి రికార్డులన్నీ బద్దలుకొట్టాడు. ఇప్పుడు ఏకంగా ఐపీఎల్ 2026 బ్యాటింగ్ అవార్డులన్నీ సొంతం చేసుకున్నాడు.ఈ ఏడాది ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ 16 మ్యాచ్‌లు ఆడి 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఒక సెంచరీతో పాటు ప్లే ఆఫ్స్‌లో 97, 96 పరుగులతో అద్భుతంగా రాణించాడు. క్వాలిఫయర్ 2లో గుజరాత్‌పై ఆడిన ఇన్నింగ్స్‌కి లెజెండ్రీ క్రికెటర్లంతా ఫిదా అయ్యారు. 15 ఏళ్ల వయస్సులోనే ఇంత బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఎలా ఆడాడంటూ ఆశ్చర్యపోయారు. 63 ఫోర్లతో పాటు 72 సిక్సర్లు బాది క్రిస్ గేల్ రికార్డును ఊదేశాడు. ఐపీఎల్ 2026 మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌తో పాటు అన్ని బ్యాటింగ్ అవార్డులన్నీ వైభవ్‌కే దక్కాయి. ఒక్క మోస్ట్ ఫోర్స్ మినహా మిగతా అన్నీ కూడా వైభవ్ ఖాతాలోనే చేరాయి. అత్యధిక ఫోర్ల లిస్ట్‌లో మాత్రం గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ ఫస్ట్ ప్లేస్‌లో నిల్చొని అవార్డు అందుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ సొంతం చేసుకున్న అవార్డుల జాబితా ఇదే. 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. భవిష్యత్తులో కూడా ఎవ్వరూ సాహసించలేని విధంగా 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. అదేవిధంగా చివరిదైన ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో ఒక్క ఫోర్స్ మినహా మిగతా అన్నీ వైభవ్ సూర్యవంశీనే సొంతం చేసుకున్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో పర్పుల్ క్యాప్‌ను 29 వికెట్లతో కగిసో రబడా సొంతం చేసుకున్నాడు. ఎక్కువ డాట్ బాల్స్ వేసిన బౌలర్‌గా మొహమ్మద్ సిరాజ్ (172) నిలిచాడు. ఫెయిర్ ప్లే అవార్డును పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది. క్యాచ్ ఆఫ్ ది సీజన్ అవార్డును కోల్‌కతా నైట్ రైడర్స్ ప్లేయర్ మనీష్ పాండే సొంతం చేసుకున్నాడు.

### కప్పు కొట్టినా నో సెలబ్రేషన్స్..

ఐపీఎల్ 2026 విజేతగా నిలిచినప్పటికీ, ఆర్సీబీ ఈసారి బెంగళూరులో ఎలాంటి విజయోత్సవ ర్యాలీ నిర్వహించకూడదని నిర్ణయించినట్లు సమాచారం. గత సీజన్ ర్యాలీలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బెంగళూరు పోలీసులు.. అభిమానుల సెలబ్రేషన్స్‌పై ఆంక్షలు విధించారు. దానికి తోడు విదేశీ ఆటగాళ్లు వారి వారి దేశాలకు వెళ్లాల్సి ఉండటం, భారత్-అఫ్ఘానిస్థాన్ టెస్ట్ ప్రారంభం కానుండటం కూడా విజయోత్సవ ర్యాలీ చేయకపోవడానికి కారణమయ్యాయి!డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఐపీఎల్ 2026 బరిలోకి దిగిన ఆర్సీబీ.. వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్ సాధించింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ క్రికెట్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ పేరులో గెలిచి విజేతగా నిలిచింది. అయితే గత సీజన్ విజయం తర్వాత ఆర్సీబీ బెంగళూరులో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ విషాదంగా మారింది. లక్షలాది మంది అభిమానులు చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాంటి విజయోత్సవ ర్యాలీ నిర్వహించకూడదని ఆర్సీబీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరిస్థితుల్లో బెంగళూరులో విజయోత్సవ ర్యాలీ, సెలబ్రేషన్స్ నిర్వహించే ఉద్దేశం ఆర్సీబీకి లేదని సమాచారం. "గత ఏడాది జరిగిన పరిణామాల దృష్ట్యా బెంగళూరులో ప్రస్తుతం కొన్ని మార్గదర్శకాలు అమలులో ఉన్నాయి. మనమంతా వాటికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. అందుకే ఈసారి ఎలాంటి విజయోత్సవ కార్యక్రమాలు, సంబురాలు నిర్వహించడం లేదు" అని ఆర్సీబీ వర్గాలు చెప్పినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి.

## నీ కెప్టెన్సీకి ఓ దండం రా బాబు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 18 ఏళ్ల సుదీర్ఘ విరామానికి తెర దించుతూ గత సీజన్‌లో ఆర్సీబీ తొలిసారి టైటిల్ నెగ్గింది. ఇక ఈ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్‌ను కాపాడుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌పై ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఫలితంగా ఐపీఎల్ టైటిల్‌ను వరుసగా రెండోసారి ముద్దాడింది. చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011), ముంబై ఇండియన్స్ (2019, 2020)ల తర్వాత బ్యాట్ టు బ్యాక్ ఐపీఎల్ టైటిల్స్ గెలిచిన మూడో జట్టుగా ఆర్సీబీ నిలిచింది. ఫైనల్లో విరాట్ కోహ్లీ 42 బంతుల్లో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.ఈ మ్యాచ్‌కు ముందు కూడా ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ గెలుస్తుందని అంతా భావించారు. ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగుతుండటంతో గుజరాత్ టైటాన్స్ జట్టుకు అడ్వాంటేజ్ ఉంటుందని అంతా భావించారు. ఇక అహ్మదాబాద్ గ్రౌండ్‌లో గుజరాత్ బౌలింగ్‌ను ఆడటం అంత సులభం కాదు. ఇక ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ గెలిస్తే కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌కు లైన్ క్లియర్ అవుతుందని కూడా అంతా భావించారు. వాస్తవంగా ఫైనల్ పోరు బెంగళూరు వేదికగా జరగాల్సి ఉంది. అయితే ఫైనల్‌ను బీసీసీఐ అహ్మదాబాద్‌కు మార్చింది. గుజరాత్ టైటాన్స్ టైటిల్ గెలిచేలా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని కొందరు ఆరోపణలు కూడా చేశారు.శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ టైటిల్ నెగ్గితే.. టీమిండియా కెప్టెన్సీ విషయంలో ఉన్న అడ్డంకులు గిల్‌కు తొలగిపోతాయని అంతా అనుకున్నారు. టి20ల్లో కూడా అతడికి కెప్టెన్సీని కట్టబెడతారంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఫైనల్లో మాత్రం అలా జరగలేదు. గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉన్నా గుజరాత్ తుస్సుమంది.మైటీ ఆర్సీబీ ముందు చేతులెత్తేసింది. ఇక బిగ్ మ్యాచ్‌ల్లో తాను అస్సలు ఆడనంటూ గిల్ మరోసారి నిరూపించుకున్నాడు. 8 బంతుల్లో 10 పరుగులు చేసిన గిల్ త్వరగా అవుటయ్యాడు. హేజల్ వుడ్ వేసిన షార్ట్ పిచ్ బాల్‌ను అర్థం చేసుకోని గిల్ గుడ్డిగా షాట్ ఆడి వికెట్‌ను పారేసుకున్నాడు. ఫామ్‌లో ఉన్న సాయి సుదర్శన్ (12) విఫలం అయ్యాడు. బట్లర్ (19) టెస్టు బ్యాటింగ్ ఆడాడు. అయితే వాషింగ్టన్ సుందర్ పోరాటంతో గుజరాత్ టైటాన్స్ 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ ముందు ఉంచగలిగింది. బౌలర్లను చక్కగా ఉపయోగించుకుని టైటిల్ సాధిస్తాడని గిల్ అభిమానులు ఊహించగా.. ఒత్తిడిలో తనకు కెప్టెన్సీ ఎలా చేయాలో అస్సలు గుర్తుండదంటూ గిల్ నిరూపించుకున్నాడు. కోహ్లీ దూకుడుకు ఎలా కళ్లెం వేయాలో అర్థం కాక తలపట్టుకున్నాడు. ఒకానొక సమయంలో కోహ్లీ అవుటంటూ అంపైర్ గుజరాత్ టైటాన్స్‌కు ఫేవర్ చేసే ప్రయత్నం చేశాడు. అయితే కోహ్లీ గ్రౌండ్ నుంచి వెళ్లకపోవడంతో థర్డ్ అంపైర్ క్యాచ్‌ను సమీక్షించాడు. చివరకు అది నాటౌట్ అని తేలింది. ఫలితంగా కోహ్లీ చివరి వరకు ఉండి గిల్ ఆశలను అడియాశలు చేశాడు. గిల్ టి20లకు అస్సలు పనికిరాడు. టెస్టులు, వన్డేలకు పరిమితం అయితే బెటర్ అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.




## ట్రోఫీని అభిమానులకు అంకితం

### ఆర్సీబీ కెప్టెన్ పటీదార్ కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఆర్సీబీ వరుసగా రెండో టైటిల్ సాధించింది. అయితే మ్యాచ్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్ పటీదార్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్ గెలవడం మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉందని అన్నాడు. అలాగే తాము ఎక్కడికి వెళ్లినా అండగా నిలిచిన అభిమానులకు ఈ ట్రోఫీని వారికే అంకితం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించాడు. ఈ సాలా కప్ నమ్దు అని నినాదం చేశాడు. ఐపీఎల్ 2026లో విజేతగా నిలిచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రెండో ఐపీఎల్ టైటిల్ దక్కించుకుంది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో గెలిచి ఈ ఫీట్ సాధించింది. రజత్ పటీదార్ సారథ్యంలోనే ఆర్సీబీ ఈ టైటిల్స్ సాధించడం గమనార్హం. గతంలో విరాట్ కోహ్లీ, డేనియల్ విటోరీ, అనిల్ కుంబ్లే, ఫాఫ్ డుప్లెసిస్, రాహుల్ ద్రావిడ్ లాంటి స్టార్‌లకు సైతం సాధ్యం కాని టైటిల్‌ను పటీదార్ అందించాడు. ఇక ఐపీఎల్ 2026 ఫైనల్ తర్వాత మాట్లాడిన ఆర్సీబీ కెప్టెన్ కీలక కామెంట్స్ చేశాడు. ఈ సీజన్‌లో తమ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు."వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉంది. ఫైనల్ కోసం ఇక్కడికి (అహ్మదాబాద్) వచ్చాక గతేడాది జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఎలా ఆడామో.. ఇప్పుడు కూడా అదే దూకుడు ప్రదర్శించాం. ఈ విజయంపై ఏం మాట్లాడాలో కూడా నాకు అర్థం కావడం లేదు. టాస్ గెలిస్తే ఏం చేయాలనే దానిపై ముందు నుంచి క్లారిటీతో ఉన్నాం. మా ప్లాన్ ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నాం. ఇక్కడ ఛేజింగ్ ఈజీగా ఉంటుందని భావించి, టాస్ నెగ్గాక బౌలింగ్ ఎంచుకున్నాం" అని పటీదార్ అన్నాడు. "ఈ సీజన్‌లో మా బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఫైనల్‌లోనూ గుజరాత్ టైటాన్స్‌లో టాప్-3 బ్యాటర్లను ఔట్ చేస్తే.. మేం మ్యాచ్‌లో పట్టుసాధించొచ్చని భావించాం. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిక్ సలామ్ దార్.. అదే చేసి చూపించారు. ఈ ముగ్గురు ఈ సీజన్‌లో చాలా ప్రభావం చూపించారు. వారే కాదు మా జట్టులోని ప్రతి ఒక్కరు చక్కగా రాణించారు. రెండోసారి టైటిల్ అందుకోవడం బాగుంది. నిజానికి గతేడాది మాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. కానీ, ఈసారి అలాంటి పరిస్థితి లేదు. అంచనాలు ఉన్నాయి, కానీ ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడాం" అని ఆర్సీబీ కెప్టెన్ వ్యాఖ్యానించాడు. "మేం ఎక్కడికి వెళ్లినా మా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ప్రోత్సహించారు. వారి కోసం మేం ఏం చేసినా తక్కువే. ఈ సాలా కప్ నమ్దు. గతేడాది మాదిరిగానే ఈసారి కప్పును కూడా వారికే అంకితం చేస్తున్నాం" అని రజత్ పటీదార్ చెప్పుకొచ్చాడు. కాగా పటీదార్ ఈ సీజన్‌లో కెప్టెన్‌గానే కాకుండా ఆటగాడిగా కూడా అదరగొట్టాడు. కీలక సమయాల్లో రాణించాడు. 14 ఇన్నింగ్స్‌లలో 501 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## కెనడా క్రికెట్ బోర్డు పై సస్పెన్షన్ వేటు

ఐసీసీ తాజాగా ఒక ఊహించని నిర్ణయం తీసుకుని క్రీడా ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు పలు ప్రపంచకప్ టోర్నమెంట్లలో పాల్గొన్న కెనడా క్రికెట్ బోర్డు పై ఐసీసీ తక్షణమే అమలులోకి వచ్చేలా సస్పెన్షన్ వేటు వేసింది. ఐసీసీ సభ్యత్వ నిబంధనలను, బాధ్యతలను కెనడా క్రికెట్ బోర్డు తీవ్రంగా ఉల్లంఘించిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. మే 31న అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ కీలక తీర్పు వెలువడింది. కెనడా క్రికెట్ బోర్డును సస్పెండ్ చేస్తున్నట్లు ఐసీసీ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఈ నిషేధం కేవలం అడ్మినిస్ట్రేషన్ కు మాత్రమే పరిమితం కానుంది. దీనివల్ల కెనడా దేశానికి చెందిన క్రికెట్ ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగదు. వారు ఎప్పటిలాగే ఐసీసీ నిర్వహించే అన్ని అంతర్జాతీయ టోర్నమెంట్లలో సాధారణంగానే పాల్గొనవచ్చని ఐసీసీ భరోసా ఇచ్చింది. ఆటగాళ్ల భవిష్యత్తు, వారి ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండటం కోసం ఐసీసీ ఒక ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ద్వారా నిధులను నేరుగా అందజేయనుంది. కెనడా క్రికెట్ బోర్డుపై విధించిన ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి ఐసీసీ కొన్ని కఠినమైన షరతులను విధించింది. బోర్డులోని పరిపాలనా లోపాలను, ఆర్థిక అవకతవకలను పూర్తిగా సరిదిద్దడమే ఈ షరతుల ముఖ్య ఉద్దేశం. కెనడా బోర్డు ఈ దిశగా పనులు చేస్తోందా లేదా అని నిరంతరం గమనించడానికి, పర్యవేక్షించడానికి ఐసీసీ ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయబోతోంది. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో కెనడా బోర్డు పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఐసీసీ మీటింగ్‌లో కెనడా నిషేధంతో



పాటు మరికొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. సాధారణంగా టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు ఆటను ముందే ముగించేస్తుంటారు, ఇది ఫ్యాన్స్‌కు తీవ్ర నిరాశ కలిగిస్తుంది. దీనిని నివారించడం కోసం.. మ్యాచ్ సమయంలో వెలుతురు తగ్గినప్పుడు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరిస్తే గనుక, ఎరుపు రంగు బంతికి బదులుగా పింక్ బాల్ ఉపయోగించవచ్చనే సరికొత్త ప్రతిపాదనకు ఐసీసీ ఆమోదం తెలిపింది. దీనివల్ల రాబోయే రోజుల్లో సాధారణ టెస్ట్ మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్ మ్యాజిక్ కనిపించనుంది.ఈ కీలక సమావేశంలో పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించిన క్వాలిఫైయింగ్ ప్రక్రియపై కూడా చర్చలు జరిగాయి. రాబోయే ప్రపంచకప్ టోర్నీల కోసం ఒక భారీ గ్లోబల్ క్వాలిఫైయర్ టోర్నమెంట్‌ను నిర్వహించే విషయంపై ఐసీసీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. దీనివల్ల అసోసియేట్ దేశాలకు ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు మరింత సమానమైన అవకాశాలు లభిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ లీగ్ క్రికెట్ (ఐపీఎల్, పీఎస్ఎల్, బిగ్ బాష్ వంటి ఫ్రాంచైజీ టోర్నీలు) విపరీతంగా పెరిగిపోతుండటంపై ఐసీసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌కు, ఈ ప్రైవేట్ ఫ్రాంచైజీ లీగ్‌ల షెడ్యూల్‌కు మధ్య సరైన సమతుల్యతను కాపాడటం ఎలా అనే అంశంపై ఐసీసీ దృష్టి సారించింది. లీగ్ క్రికెట్ వల్ల అంతర్జాతీయ మ్యాచులు దెబ్బతినకుండా ఉండేందుకు, దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి ఐసీసీ ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# విశ్వజ



## నానబెట్టిన బాదం తింటే ఈ సమస్యలకు మంచి రిలీఫ్..!!

బాదం ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. బాదంలో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. శక్తిని అందిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ను నిరోధిస్తుంది. బాదంలో అనేక రకాలైన విటమిన్లు లభ్యం అవుతాయి. నానబెట్టిన బాదం తినటం ద్వారా మధుమేహం నియంత్రణతో పాటుగా రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుంది. అయితే, బాదం పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాదం ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. బాదం ఎప్పుడూ నానబెట్టిన తర్వాత, ఖాళీ కడుపుతో తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నోటి లోపల చాలా ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది బాదంను జీర్ణం చేయడంలో, ప్రయోజనాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఒక రోజులో 20 నుండి 30 గ్రాముల బాదం గింజలను తినవచ్చునని చెబుతున్నారు. బాదం పప్పు తినడం వల్ల ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఆరోగ్యకరమైన కొవ్వు, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ 2, భాస్వరం, రాగి లభిస్తాయి. ఇవి మెదడు, కండరాలు, కడుపు మరియు గుండెకు ప్రయోజనకరంగా ఉంటాయి. బాదంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి పనిచేస్తాయి. ఈ ఒత్తిడి కణాలను దెబ్బతీస్తుంది. దాదాపు అన్ని దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్, ఇది జుట్టు, చర్మం, కండరాలకు చాలా అవసరం. కణాల నిర్మాణానికి ఇది చాలా ముఖ్యమైనది. మధుమేహం నియంత్రించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగకుండా నిరోధిస్తుంది. రక్తపోటును నియంత్రించే మెగ్నీషియం సైతం బాదంలో పుష్కలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కానీ బాదం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే, వైద్యులు నిర్దేశించిన మొత్తంలో నాన బెట్టిన బాదం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## మొటిమలు మాయం

జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజులో నాలుగైదుసార్లు చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఉదయం, సాయంత్రం రోజ్‌వాటర్‌తో ముఖం కడుక్కుంటే మొటిమల తీవ్రత తగ్గుతుంది. నూనె వంటకాలు మొటిమలకు కారణం అవుతాయి. రెగ్యులర్ డైట్‌లో నూనె శాతం తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. నీళ్లు సమృద్ధిగా తాగాలి. రెగ్యులర్‌గా పండ్ల రసాలు తీసుకోవాలి. డిప్రెషన్‌లో ఉన్నవారికి సైతం మొటిమలు వచ్చే అవకాశం ఉందని పలు పరిశోధలు చెబుతున్నాయి. మానసికంగా సంతోషంగా ఉండాలి. సాలిసిలిక్ ఆయిల్, టీట్రీ ఆయిల్ కలిగిన ఫేస్‌వాష్‌లను ఉపయోగించడం వల్ల మొటిమలు తగ్గుముఖం పడతాయి. కలబంద జెల్‌తో కస్తూరి కలిపి ఫేస్‌ప్యాక్‌గా వేసుకున్నా మొటిమలను నియంత్రించవచ్చు.

# పెసల మొలకలతో ఇలా చేస్తే.. రెట్టింపు శక్తి, ఎన్నో లాభాలు...!!



ప్రతిరోజు పెసలును నానబెట్టుకుని మొలకలు చేసుకుని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెసరలో మెగ్నీషియం, పొటాషియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, మెరుగైన నిద్రకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. ఉదయం వేళ బ్రేక్ ఫాస్ట్ వేళ వీటిని తీసుకుంటే రెట్టింపు శక్తి ఇవ్వటంతో పాటుగా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. మొలకల్లో విటమిన్‌లు, మినరల్‌లు, ఫైబర్, మరియు ప్రోటీన్‌లు అధికంగా ఉంటాయి. వీటల్లో ముఖ్యంగా విటమిన్ కాంప్లెక్స్, మరియు విటమిన్ లాంటి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. మొలకలను తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మొలకలు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం కావడంతో, ఇబ్బంది లేకుండా జీర్ణమవుతాయి. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మొలకల్లో ప్రోటీన్ చాలా శాతం లభిస్తుంది, ప్రత్యేకంగా పప్పులు, శెనగలు వంటి వాటి మొలకల్లో అధికంగా ప్రోటీన్ ఉంటుంది. ఇది మాంసాహారాన్ని తగ్గించి, ప్రోటీన్ అవసరాలను తేలికగా తీర్చగలగడం వలన, ఇది శాకాహారులకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది. మొలకలు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువ. మొలకల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మొలకల్లో ఉండే విటమిన్ శరీరాన్ని వింత రోగాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మొలకల్లో ఫైబర్ మరియు పుట్టుమటుకులాంటి పోషకాలు అధికంగా ఉండటంతో, ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఫలితంగా, హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, ఈ మొలకలు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. మొలకల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా, మొలకలు మధుమేహం ఉన్న వారికి చాలా మంచివి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ క్రమంలో ఉంటాయి. మొలకలు యాంటీ-క్యాన్సర్ లక్షణాలను కలిగి ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

# ఏ చిన్న అనారోగ్యమైనా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారా? ఎంత డేంజర్ అంటే

యాంటీబయాటిక్స్ .. ప్రస్తుతం మన సమాజంలో యాంటీబయాటిక్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో యాంటీబయాటిక్స్ దుర్వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతుంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగించడం వల్ల వారిలో యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ పెరుగుతుంది.

**యాంటీ బయాటిక్స్ విపరీతమైన వాడకం.. ఆరోగ్య ముప్పు**


ఇక గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేని ఆర్ఎంపీ వైద్యులు చిన్న చిన్న అనారోగ్యాలకు చాలా ఎక్కువ డోసేజ్ యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారు. ఇది కూడా వారిలో యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ కు కారణం అవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి చోటు చేసుకుంటుంది. ప్రజల ఆరోగ్యానికి పెరుగుతున్న అతిపెద్ద ఆందోళన.

**యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ వస్తే కష్టం**

యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది బాక్టీరియా మార్పులు చెందినప్పుడు, మందుల ప్రభావాలకు ఇమ్యూన్‌గా మారినప్పుడు జరుగుతుంది. దీనివల్ల ఇతరత్రా వ్యాధులు సంక్రమించిన చికిత్స చేయడం కష్టం అవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు తక్కువగా ఉండటం వల్ల యాంటీబయాటిక్స్ తో సొంత వైద్యం చేసుకుంటున్నారు. ప్రజలు తరచుగా డాక్టర్‌ను సంప్రదించకుండా స్థానిక దుకాణాల నుండి ఈ మందులను కొనుగోలుచేసి వాడడం కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**యాంటీ బయాటిక్స్ వల్ల మనకు తెలీకుండానే సైడ్ ఎఫెక్ట్స్**

యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయదు, ఇది ప్రజా ఆరోగ్యానికి విస్తృతమైన ప్రభావాలను కలిగి ఉంటుంది. మనకు తెలియకుండానే మన





శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్ కు యాంటీబయాటిక్స్ కారణమవుతున్నాయి. అందుకే యాంటీబయాటిక్స్ ఎక్కువగా ఉపయోగించడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది. అందుకే యాంటీబయాటిక్స్ వినియోగం పైన, విక్రయం పై కఠినమైన నియంత్రణలు అవసరం. వైద్యులు, రోగులకు యాంటీబయాటిక్స్ తగిన విధంగా ఉపయోగించకపోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచాలి. గ్రామీణ ప్రాంతాలలో నేరుగా యాంటీబయాటిక్స్ కొనుక్కునే విధానాన్ని నియంత్రించాలి. సాధ్యమైనంతవరకు ఆరోగ్య సమస్యలను నాచురల్ గానే తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

# మార్కెట్

## ఐపీవోకి ఆర్ఎస్‌బీ రిటైల్..

### రూ.1,500 కోట్ల నిధుల సేకరణలో సంస్థ

హైదరాబాద్ : ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.




# ఫాస్టాగ్ వార్షిక పాస్.. తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో %ఖీూఒుఖుస్త్ర% వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్‌ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వివరించింది.

**ఎవరికి వర్తిస్తుంది?**

ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన జాతీయ




రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది.

**పాసు ఎలా కొనాలి?**

వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# ఆంధ్రప్రదేశ్

## పెన్షన్ల కోసం రూ.65,886.57 కోట్లు విడుదల

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

### సత్యవరంలో పెన్షన్లు పంపిణీ చేసిన హోంమంత్రి

విజయనగరం/అనకాపల్లి,జూన్1 : ఏపీ వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం గింజేరులో కూటమి నాయకులతో కలిసి మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 62,34,445 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జూన్ నెలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2728 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. కొత్తగా జూన్ నుంచి 5606 స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఈ లబ్ధిదారులకు ప్రత్యేకంగా రూ.2.24 కోట్లు విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ.65,886.57 కోట్లు విడుదల చేశామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రితో పాటు పెన్షన్ల పంపిణీలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకురాలు బగ్గు అర్చన పాల్గొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. సోమవారం ఉదయం సత్యవరం గ్రామానికి చేరుకున్న హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. సత్యవరం గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అనిత పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. శ్రీరాంపురం గ్రామంలో బొడ్డపాటి వీరాస్వామి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అనంతరం ఇటీవల కాలంలో అకాల వర్షాలకు మరణించిన అరట్లకోట గ్రామానికి చెందిన ఎరకయ్య, శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు.

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య

### అదనపు కట్నం వేధింపులే అంటున్న కుటుంబ సభ్యులు

లక్నో,జూన్1 : పెళ్ళైన రెండేళ్లకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లఖ్‌నవూకు చెందిన సాగర్ రాజ్‌పుత్‌కు 2024లో కాన్పూర్‌కు చెందిన మాన్షితో పెళ్లయింది. మాన్షి తల్లిదండ్రులు వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం బాగానే సాగింది. ఇద్దరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగర్‌కు ఇన్‌స్టాలో 8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి వీడియోలు చేసే వారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, మాన్షి అత్తింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణంపై మాన్షి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 'పెళ్లి సమయంలో వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చాం. అయినా వాళ్లకు సంతృప్తి కలగలేదు. అదనపు కట్నం కోసం నా కూతురిని హింసిస్తున్నారు. కారు కావాలని అడుగుతున్నారు. తక్కువ కట్నం తెచ్చిందని అంటూ మాన్షిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు'.. వేధింపుల గురించి మాతో చెప్పుకుని మాన్షి చాలా ఏడ్చేది. మాన్షి అత్తింటి వారికి సర్ధి చెప్పటం కోసం పలుమార్లు లఖ్‌నవూ వెళ్లి వచ్చాము. మా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని శనివారం ఫోన్ కాల్ వచ్చింది. మా కూతురిది ముమ్మాటికీ హత్యే. మాన్షిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు' అని అన్నారు. పోలీసులు సాగర్‌తో పాటు మరో ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బార్‌లో యువకుల మధ్య గొడవ

### యువతని కారుతో ఢీకొని చంపిన దుండగులు

చెన్నై,జూన్1 : ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ధి చెప్పి బయటకు పంపించారు. ఃబార్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు. అయితే యాన్సీ స్నేహితులు కారుపై రాళ్లు విసరడంతోనే ..వారు ఢీకొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన యాన్సీ అక్కడికక్కడే మృతి చెందంగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. నిందితులను కఠిన శిక్ష విధించాలని మృతురాలి కుటుంబం కోరింది. 18 ఏళ్లలోపు వారిని బార్‌లోకి అనుమతించినందుకు అధికారులు ఆ ప్రైవేట్ బార్‌ను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు.

## రాయదుర్గం భూముల ధరలకు రెక్కలు

హైదరాబాద్,జూన్1 ) :రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి ఆకాశాన్ని తాకాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన భూముల వేలంలో ఎకరాకు రూ.204 కోట్ల ధర పలికింది. దీంతో ఐటీ కారిడార్‌లో భూములకు ఉన్న భారీ డిమాండ్ మరోసారి స్పష్టమైంది. తాజాగా టీజీఐఐసీ 5.09 ఎకరాల భూమిని వేలానికి పెట్టగా, ఈ వేలం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. ఐటీ, వాణిజ్య రంగాల విస్తరణతో ఈ ప్రాంతంలో భూముల విలువలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, కేవలం రెండు రోజుల క్రితమే నిర్వహించిన మరో భూముల వేలంలో ఎకరాకు రూ.237 కోట్ల రికార్డు ధర పలికింది. ఆ వేలం ద్వారా టీజీఐఐసీకి రూ.1,490 కోట్ల ఆదాయం లభించింది. ఃతాజా వేలం, గత వేలం కలిపి రెండు విడతల్లో టీజీఐఐసీకి దాదాపు రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరింది. రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల కోసం పెట్టుబడిదారులు, సంస్థలు తీవ్ర పోటీ పడుతుండటంతో భూముల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి.

## విశాఖపట్నంలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు

### సంస్థ సీఈవో రాబిన్ ఖుదాను కోరిన లోకేశ్

### ముంబైలో ఎయిర్ ట్రంక్ సీఈవోతో లోకేష్ భేటీ



ముంబై,జూన్1 : విశాఖపట్నంలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాను ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. సోమవారం ముంబయిలో ఎయిర్ ట్రంక్ సీఈవోతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖపట్నం అన్ని విధాలా అనుకూలత కలిగి ఉందని ఆయనకు మంత్రి లోకేష్ వివరించారు. అలాగే డేటా సెంటర్ హబ్‌గా విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏఐ, డేటా హైపర్ స్కేల్ హబ్‌గా విశాఖ నగరం ఆవిర్భవిస్తోం దన్నారు. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీ కనెక్స్ తదితర ప్రధాన ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని రాబిన్ ఖుదాకు మంత్రి లోకేష్ సోదాహరణగా వివరించారు. విశాఖపట్నం నగరంలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎయిర్ ట్రంక్ సీఈవోకు లోకేష్ స్పష్టం చేశారు. మల్టీ - గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకో సిస్టమ్ అభివృద్ధిపై తాము దృష్టి సారించామన్నారు. ఎయిర్ ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాకు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని రాబిన్ ఖుదాకు లోకేష్ చెప్పారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా తమ వద్ద సిద్ధమవుతున్నాయని చెప్పారు. ప్రఖ్యాత హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్‌లో మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తొలిసారి రాబిన్ ఖుదాతో మంత్రి లోకేష్ తొలిసారి సమావేశమయ్యారు. ఆ తర్వాత భారత్‌లో విస్తరణ కోసం ఎయిర్ ట్రంక్ సంస్థ బృందం పలుమార్లు ఏపీ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. భారత్‌లో ఒక ఎ÷-లాట్ ఫాం ఏర్పాటు చేసిన తర్వాత విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మరో వైపు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎయిర్ ట్రంక్ భారత్‌లో ప్రవేశించిన సంగతి తెలిసిందే. ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో ఆ సంస్థ ప్రాజెక్టులు కలిగి ఉన్నాయి. ఇదిలావుంటే ముంబై పర్యటనలో సిఎం ఫ్డనవీస్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. ఎపి అభివృద్ధి, వివిధ కంపెనీల ఏర్పాటుపై చర్చించారు.

## మేలో రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు

### శ్రీవారిని దర్శించుకున్న 25,46,168 మంది భక్తులు

### రూ.120.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వెల్లడి




తిరుమల,జూన్1 : తిరుమలలో మే నెలలో రికార్డు స్థాయిలో భక్తులు కలియుగదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ యేడాది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మే మాసంలో రికార్డు స్థాయిలో తిరుమల శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు కావడం, విద్యాసంస్థలకు విరామం రావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మే నెలలో తిరుమలలో రికార్డు స్థాయి దర్శనాలు, కానుకలు, తలనీలాలను భక్తులు సమర్పించారు. మే మాసంలో తిరుమల శ్రీవారిని 25,46,168 మంది భక్తులు దర్శించుకున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, స్వామివారిపై ఉన్న భక్తి శ్రద్ధలతో భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సర్వదర్శనం భక్తులకు గంటల తరబడి వేచి ఉండే పని లేకుండా కంపార్ట్‌మెంట్‌లలో నిరంతరం తాగునీరు, పాలు, అన్నప్రసాదాల పంపిణీని నిరంతరాయంగా కొనసాగించారు. శ్రీవారిపై భక్తులు తమకున్న అపారమైన భక్తిని కానుకల రూపంలో చాటుకున్నారు. మే నెలలో స్వామివారికి రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. తిరుమల చరిత్రలో ఒకే నెలలో ఈ స్థాయి ఆదాయం రావడం భక్తుల అచంచల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. నగదు రూపంలోనే కాకుండా భక్తులు పెద్దఎత్తున బంగారం, వెండి ఆభరణాలను కూడా హుండీలో సమర్పించారు. స్వామివారికి భక్తులు తలనీలాలు సమర్పించారు. మే నెలలో 12,29773 మంది భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామి వారి దర్శనానికి ముందుగా భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. ఈ ఏడాది తలనీలాలను భక్తులు రికార్డు స్థాయిలో సమర్పించారు. మే మాసంలో 12,43,063 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు ఇచ్చారు. మే 1 నుంచి మే 27వ తేదీ వరకు శ్రీవారికి మొక్కుల రూపంలో భక్తులు తననీలాలు సమర్పించుకున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. గతంలో ఉన్న రికార్డులను ఇది అధిగమించిందని తెలిపింది. 2024 మే నెలలో 10.65 లక్షల మంది, 2025, మే మాసంలో 10.18 లక్షల మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారని గణాంకాలతో సహా టీటీడీ వివరించింది. మే 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజు 50 వేల మంది భక్తులు తలనీలాలు ఇచ్చారని చెప్పింది. అయితే మే 23వ తేదీ ఒక్క రోజే.. 57,580 మంది భక్తులు తమ మొక్కుల కింద తలనీలాలు ఇచ్చారని పేర్కొంది. ఇటీవల కాలంలో అత్యధికంగా తలనీలాలు సమర్పించినది మే 23వ తేదీ అని టీటీడీ స్పష్టం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమలలో కళ్యాణకట్టతోపాటు 11 తలనీలాల కేంద్రాలు ఏర్పాటు చేశామని టీటీడీ వివరించింది. తలనీలాల కోసం 1,150 మంది మంగలి వారిని ఏర్పాటు చేశామంది. వారిలో 269 మంది మహిళలు కూడా ఉన్నారని చెప్పింది. మొక్కుల రూపంలో భక్తులు ఇచ్చిన తలనీలాలను విదేశాలు.. చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తామని టీటీడీ పేర్కొంది. అలాగే ఇటీవల కాలంలో తలనీలాలను వేలంపాటు వేయడం ద్వారా వస్తున్న ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. తలనీలాల ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 67 కోట్లు వచ్చిందని వివరించింది. ఇలా ప్రతి ఏడాది తలనీలాల ద్వారా టీటీడీకి భారీగా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తలనీలాల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని టీటీడీ పేర్కొంది. వేసవి సెలవులతోపాటు వారాంతం సెలవుల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని తిరుమల తిరుపతి దేవస్థానం వివరించింది. స్వామివారికి హుండీ, విరాళాలతోపాటు తలనీలాల రూపంలో కూడా ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని భక్తుల సేవకు టీటీడీ వినియోగిస్తున్న సంగతి తెలిసిందే.

## మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు

### ఆరోపణలు అవాస్తవమన్న ప్రభుత్వ కార్యదర్శి జైన్

అమరావతి,జూన్1 : మెగా డీఎస్సీ 2025 నియామకాల్లో స్పోర్ట్స్ కోటాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు. దీనిపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. సోమవారం రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అజయ్ జైన్ మాట్లాడుతూ.. 2024 డిసెంబర్‌లోనే ఏపీ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ప్రకటించిందన్నారు. ఈ ఉద్యోగ నియమకాల్లో రిజర్వేషన్లను 2 నుంచి 3 శాతానికి పెంచిందని వివరించారు. 65 క్రీడలకు ఈ స్పోర్ట్స్ కోటా వర్తిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ 2025లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. అందులో 3 శాతం రిజర్వేషన్‌లో భాగంగా 431 పోస్టులు కేటాయించామని వివరించారు. 3,600 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని అజయ్ జైన్ చెప్పారు. 5,326 అప్లికేషన్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని తెలిపారు. 382 మంది మెరిట్ లిస్ట్‌లో రాష్ట్ర స్థాయి కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఇంకా 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 2011 నుంచి స్పోర్ట్స్ సర్టిఫికేట్స్‌ను జారీ చేసేది.. ఫెడరేషన్లు, అసోషియేషన్లు, యునివర్సిటీలేనని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గుర్తు చేశారు. స్పోర్ట్స్ కోటా సర్టిఫికేట్లు.. క్రీడలు శాఖ కానీ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కానీ జారీ చేయదని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ కోటాలో అభ్యర్థులు దరఖాస్తు చేసిన అన్ని సర్టిఫికేట్లను క్షుణ్ణంగా పరిశీలించామని అజయ్ జైన్ చెప్పారు. దీనిపై ఏపీ హైకోర్టులో 69 కేసులు దాఖలు కాగా.. వాటిలో 3 కేసులను కోర్టు కొట్టివేసిందన్నారు. ఇంకా 66 కేసులు పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే మొత్తం 192 ఫిర్యాదులు అందాయని.. అన్ని డిస్పోజ్ చేశామని వివరించారు. స్పోర్ట్స్ కోటాలో అభ్యర్థుల ఎంపిక అంతా సక్రమంగానే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల్లో అనవసర అపోహలు సృష్టించవద్దంటూ దీనిపై ప్రచారం చేసే వారికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సూచించారు.

## రాష్ట్రంలో అలజడుల సృష్టికి వైసిపి కుట్రలు

### శాంతిభద్రతలకు విఘాతం కల్పించే యత్నాలు

### రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

నంద్యాల,జూన్1 : స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతుందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి, శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతల ఉచ్చులో పడకుండా మరింత అప్రమత్తంగా ఉండాలంటూ కూటమిలోని పార్టీ నేతలతోపాటు కార్యకర్తలకు ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సంజామల మండలం ముదిగేడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహంపై దాడి చేసింది.. వైసీపీ కార్యకర్త జంబులయ్య అని వివరించారు. తాము వైసీపీ మద్దతుదారులమంటూ జంబులయ్య భార్య బాలమ్మ వీడియో రిలీజ్ చేసిందని తెలిపారు. తమకు స్థానిక వైసీపీ కార్పొరేటర్ శేషయ్య ఉద్యోగం ఇప్పించారని కూడా ఆమె చెప్పిందని పేర్కొన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీని ఇరికించే ప్రయత్నం వైసీపీ చేసిందని ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1995లో చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచి ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపారని గుర్తు చేశారు. ప్రశాంతంగా ఉన్న పల్లెలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన గొడ్డలి పార్టీ నాయకుడు, నేతలకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

### కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల


న్యూఢిల్లీ,జూన్1 : సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్ , జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత దిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

## నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం

### ఒకేరోజు ముగ్గురు మహిళల మెడగొలుసులు చోరీ

నెల్లూరు,జూన్1 : నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు ముగ్గురు మహిళల మెడల్లో బంగారు గొలుసులను అపహరించడం తీవ్ర కలకలం రేపింది. జేమ్స్ గార్డెన్, పడరుపల్లి, చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతాల్లో దుండగులు బరితెగించారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు సాగాయి. మొత్తం 9 సవర్ల బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నవాబుపేట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి.

వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఒకే రోజు మూడు ప్రాంతాల్లో దుండగులు చోరీకి పాల్పడటం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. చైన్ స్నాచర్లను వెంటనే పట్టుకోవాలని వారు కోరుతున్నారు.




## పెద్దిలో స్పోర్ట్స్‌కే ప్రాధాన్యం

### హీరో రామ్‌చరణ్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని విడుదల దగ్గర పడుతుండడడంతో సోషల్ మీడియాలో రోజుకో వార్త వైరల్ అవుతోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లోని సూపర్ హిట్ సాంగ్ 'అబ్బనీ తియ్యనీ దెబ్బ'ను ఇందులో రీక్రియేట్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ దీనిపై స్పందించారు. మీరు కొన్ని విషయాలు బిగ్‌స్క్రీన్ మీద చూసి తెలుసుకోవాలి. మేం ఆ పాటను రీక్రియేట్ చేయలేదు. కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. అలాంటివి అన్నీ యాడ్ చేస్తే ఇది మరీ కమర్షియల్ సినిమా అవుతుంది. అది ఐకానిక్ సాంగ్' అని చరణ్ అన్నారు. ఇక 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. 'క్రీడలపై పూర్తి ఫోకస్‌తో ఉంటూ వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు దీన్ని కచ్చితంగా చూడాలి. థియేటర్ నుంచి భావోద్వేగంతో బయటకు వస్తారు. వీక్ మైండ్ ఉన్నవాళ్లు కూడా చాలా స్ట్రాంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. జీవితంలో అత్యంత కష్టమైన సమయాలను ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై స్పష్టమైన ఆలోచన వస్తుంది. మనకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా జీవితం ముందుకు సాగిపోవాలి అని 'పెద్ది' మనకు నేర్పుతాడు. ఈ జనరేషన్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయమిదని రామ్ చరణ్ తెలిపారు. ఇక, తండ్రి చిరంజీవిని చూసి ఎంతో స్ఫూర్తి పొందానని రామ్ చరణ్ చెప్పారు. ఆయన లేకపోతే తన జీవితమే లేదన్నారు. బాబాయ్ పవన్ కల్యాణ్‌ను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు.



## పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.




## శరవేగంగా ప్రభాస్ 'స్పిరిట్'


నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పుకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

## అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.







## వ్యక్తిత్వ హననం చేసే ట్రోల్స్

### ట్రోల్ చేస్తున్న వారిపై మాధురి మండిపాటు

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రి, ధర్మ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు. ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే' అన్నారు. త్రిప్తి మాట్లాడుతూ.. 'ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడిపెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది' అని అంది త్రిప్తి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com